సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

APTEL 14598/2015.

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి | ఆదివారం 21 ఫిబ్రవరి, 2016 సంపుటి : 1 సంచిక 21 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00



## క్యారెట్ కష్టాలు

**రాజధాని ప్రతనిధి :** రాజధాని గ్రామాల్లో క్యారట్ సాగు నష్టాల బాటలో సాగుతోంది. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం పరిధిలోని లంక భూముల్లో క్యారట్ సాగు చేస్తున్న రైతులు పెట్టిన పెట్టుబడులు ఇప్పుడు రావడం లేదని వాపోతున్నారు. జిల్లాలో పంట అధికంగా దిగుబడి కావడం వల్ల మార్కెట్లో కేజీ కనీసం రూ.5 కూడా రాకపోవడం తమకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని, లంక భూముల్లో పండిన పంటను తమ పడవల ద్వారా ఇవతలి ఒడ్డుకు చేర్చి వాటిని శుభ్రపరిచి వాటిని మార్కెట్‌కు తరలిస్తున్నామన్నారు. ఇంత చేసినా పెట్టుబడులు రాక తమ శ్రమంతా కృష్ణానది పాలవుతోందని వాపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.20 నుంచి 25 వరకు ఉందని, కానీ తమ వద్ద రూ.5 కూడా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే క్యారట్ తమను నిరాశపెట్టి దళారులకు భాగ్యంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తాళ్లాయపాలెం ఒడ్డున ఉన్న శైవ క్షేత్రం రేవు నుంచి లంక భూముల్లో పండిన పంటను పడవలను అద్దెకు తీసుకుని మరీ క్యారట్‌ను శుభ్రపరచడానికి ఏర్పాటు చేసిన వరల్లో శుభ్రంగా కడిగి ఆటోల ద్వారా విజయవాడ మార్కెట్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

తమ వద్దకొనుగోలు చేసే దళారులు ఒకే గ్రూపుగా తయారై ధరను తగ్గిస్తున్నారని, దిక్కులేక తీసుకువెళ్లిన పంటను వారికి అప్పజెప్పడమే తమకు మిగిలిన ఏకైక దారని చెప్పారు. తాము పంట వేయక ముందు మంచి ధర ఉండేదని, పంట చేతికి వచ్చాక కూలి కూడా రావడం లేదని వాపోతు న్నారు. తాళ్లాయపాలెం, ఉద్దండరాయపాలెం, వెంకటపాలెం పరిధిలోని లంక భూముల్లో రైతులు అధికశాతం క్యారట్‌ను సాగు చేస్తున్నారు. సీఆర్‌డీఏ అధికారులు స్పందించి తమ లంక భూములను భూ సమీకరణ కింద తీసుకుంటామని హామీ ఇచ్చారని, కానీ రాత పూర్వకంగా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి క్యారట్ సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. దళారులను కట్టడి చేసి మార్కెట్ ధరను ఇప్పించాలని కూడా వారు కోరుతున్నారు.

**రైతులు అభిప్రాయాలు....**



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని క్యారట్ సాగు చేశాను. బయట వడ్డీలకు తీసుకువచ్చిన డబ్బును పంటపై పెట్టాను. అధిక దిగుబడి వచ్చిందని ఆనందపడ్డాను. కానీ గిట్టుబాటు ధరలేక ఏమి చేయాలో, చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

**మురహరి, రైతు, తాళ్లాయపాలెం.**




నేను మూడు సంవత్సరాలుగా క్యారట్ పంట పండిస్తున్నాను. గత ఏడాది అధికంగా ధర ఉన్నా పంట దిగుబడి కాక తీవ్రంగా నష్టపోయాను. కానీ ఈ ఏడాది పంట అధికంగా పండింది కానీ, గిట్టుబాటు ధర లేక అప్పులకు అధిక వడ్డీలై ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదు

**దేవదాసు, రైతు, తాళ్లాయపాలెం**

## శైవ క్షేత్రంలో ఆధునికీకరణ పనులు

### మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు

**రాజధాని ప్రతినిధి :** తుళ్లూరు మండలంలో తాళ్లాయపాలెంలో కొలువై ఉన్న శ్రీశైవ క్షేత్రంలో ఆలయ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పాత ఆలయాలపై ఉన్న గోపురాలను ఆధునికీకరిస్తున్నారు. వచ్చే నెలలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఆలయాల ధ్వజ స్తంభాలకు ఇత్తడి తొడుగును అమరుస్తున్నారు. తాపీ మేస్త్రులు, కూలీలు రాత్రీ పగలూ కష్టపడి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో గోశాల వద్ద నాపరాయిలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా తాగునీటి సౌకర్యం, నిత్యాన్నదాన ఏర్పాట్లు నిత్యం జరుగుతుంటాయి. ఎప్పటినుంచో ఇక్కడ దశలవారీగా వివిధ ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నారు. మన రాజధాని పరిధిలోని శైవ క్షేత్రం బాగా అభివృద్ధి చేసి భక్తులకు అభిషేకాలకు, నిత్య పూజలు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ఎప్పుడు వచ్చిన అర్చకులు అందుబాటులో ఉంటారు. రానున్న శివరాత్రి వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తామని ఆలయ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి తెలిపారు.







## తుళ్లూరులో వైఎస్ జగన్ పర్యటన



**రాజధాని, తుళ్లూరు :** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు మండలంలో పర్యటించారు. పలువురు నాయకుల పిల్లల వివాహాలు, విందు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆయన వచ్చారు. మండలంలోని ఉద్దండరాయపాలెంలో నందిగం సురేష్ మేనల్లుడు వివాహానికి ఉదయం 9.30 గంటలకు హాజరయ్యారు. దంపతులను ఆశీర్వదించారు. అనంతరం రాయపూడి గ్రామానికి వచ్చి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కాలనీవాసులు అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. తర్వాత వడ్డమాను గ్రామానికి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శివారెడ్డి కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. తర్వాత ఒంగోలు బయలుదేరి వెళ్లారు.



సాయంత్రం గుంటూరుకు తిరిగి వెళ్లిన ఆయన ఆ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వ్యక్తిగత పర్యటనలో జగన్ పెద్దగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. జగన్ పర్యటనను పురస్కరించుకుని కార్యకర్తలు హడావుడి చేశారు.

## చంద్రుడి మీదకు మామ్ సియాచిన్ మీదకు సైనికులు ?



**రాజధాని,** సియాచిన్...మంచుపర్వతం ...చూడాలంటే మెడలు వెనక్కి వంచాలి.. ఎక్కాలంటే ధైర్యం ఉండాలి...గాలికూడా వీచని ఆ నిర్జన ప్రదేశంలో ప్రకృతి ప్రకోపించి మిన్ను విరిగి మీదపడిందా అన్నట్లు ఒక్కసారే 170 కిలోమీటర్ల వేగంతో మంచుతుఫాను మీదకొస్తే...ఈ విశాల విశ్వంలో చీమంత ఉన్న మనిషి మృత్యువుతో జరిపే పోరాటమే సియాచిన్ పర్వతాల్లో సైనికుడి జీవితం.. చెట్టు, పుట్ట, జంతుజాలం ఏమీలేని ఆ మంచుకోనల్లో తమ వారినందరినీ వదిలి తమ దేశం కోసం అహర్నిశలు శ్రమించే వారిని కోల్పోవడం భారతీయులందరినీ కదిల్చివేసింది. సియాచిన్ ఘటనలో తొమ్మిది మంది చనిపోయినా హనుమంతప్ప ఒక్కడే ఆరురోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ... ప్రాణాలతో ఉన్నాడని జాతంతా తొమ్మిది మందినీ ఈ ఒక్కరిలో చూసుకోవాలని పరితపించి, ప్రార్థనలు జరిపింది. అవయవదానానికి దాతలంతా ముందుకొచ్చారు. సైనిక ఆసుపత్రి సిబ్బంది శక్తివంచనలేకుండా ప్రయత్నాలు జరిపింది. చావుతో పోరాడి అలసిపోయిన హనుమంతప్ప శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. దేశం విషాదంలో మునిగింది. మంచులో ఉండటం వల్ల మొదటిగా ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుతుంది. రక్తప్రసరణ మందగించి, గుండెపోటు వచ్చే ఛాన్సులు ఎక్కువ. మంచు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా శరీరావయవాలను తినేస్తుంది అంటే స్పర్శను కోల్పోతాయి. ఇదీ మంచుకొండల్లో మనుషుల అవస్థలు...

*చంద్రుడి మీదికి మామ్... అరుణ గ్రహం మీదికి మార్స్...పంపిన శాస్త్రవేత్తలున్న మన దేశంలో ఇంకా సియాచిన్ లాంటి ప్రదేశంలో మనుష్యులనే ఉపయోగించడం సబబుగా ఉందా...? శక్తివంతమైన రాడార్లు... స్పెన్సర్లు, రోబోలున్నాయి. వీటిని ఉపయోగించకుండా ఇంకా ఎన్నాళ్లు సైనికుల ప్రాణాలను హరిస్తారు...ఇప్పట కైనా విజ్ఞులు, మానవతావాదులు, శాస్త్రజ్ఞులు మేల్కొని దీనికి ప్రత్యామ్నాయం వెదకాలి...సైన్యం ప్రాణాలకు విలువుందని గుర్తించాలి.*

## 7న రాజధాని నిర్మాణం పై ఎన్‌జీటీ విచారణ



**రాజధాని :** అక్టోబరు 10వ తేదిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సిఆర్‌డిఏకి రాజధాని నిర్మాణ పనులు ఆపాలని, పిడికిడి మట్టికూడా తీయకూడదని ఎన్‌జీటీ ఉత్తర్వులు జారీ చేసింది. అయినా జుడిషియల్ ఉత్తర్వులు తుంగలో తొక్కి ప్రభుత్వం పనులు వేగవంతం చేసింది. పిటీషనర్ అక్టోబరు 16వ తారీఖున రాజధానిలో చేస్తున్న పనులను సాక్షాదారాలతో ఎన్‌జీటీకి సమర్పించింది. ఎన్‌జీటీ పరిశీలన పిదప మళ్ళీ ఉత్తర్వులు జారీ చేస్తూ గుంటూరు కలెక్టరు వరిని సుమోటోగా తీసుకొని ఆదేశాలు జారీ చేసింది. కాని అక్టోబరు 22న శంఖుస్థాన యధావిధిగా జరిగింది. నవంబరు 3 న పిటిషనర్ కంటెప్ట్ ఆఫ్ జ్యూడిషియల్ ఆర్డర్ వేయడం జరిగింది. నవంబర్ 5న పిటీషనన్ స్వీకరించి, ప్రభుత్వానికి కంటెప్ట్ నోటీసును పంపించింది. ఆ కంటెప్ట్ నోటీసు మీద మార్చి 7న విచారణ జరగనున్నదని సామాజిక కార్యకర్త పి. శ్రీమన్నారాయణ తెలిపారు.



నవ్యాంధ్ర తొలి మహిళా కమిషన్ చైర్‌పర్సన్

## నన్నపనేని రాజకుమారికి అభినందనలు

నవ్యాంధ్ర తొలి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ నాయకురాలు నన్నపనేని రాజకుమారిని ఎ.పి.యు.డబ్లు.జె. నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమెను సత్కరించారు. రాష్ట్రంలో మహిళలపై హింస, దౌర్జన్యాలను అరికడతానని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.యు.డబ్లు.జె. తెనాలి అధ్యక్షులు బి.యన్. నారాయణ, కార్యదర్శి బొల్లిముంత కృష్ణ, ఎ.పి.యు.డబ్లు.జె. జిల్లా ఉపాధ్యక్షులు ఓ.మార్కెండేయులు, యల్. వెంకటేశ్వరరావు, సి.హెచ్. రాజగోపాల్, సి.హెచ్. సుధాకర్, పలువురు జర్నలిస్టులు రాజకుమారిని అభినందించిన వారిలో ఉన్నారు.

## ముస్లింల పై ప్రభుత్వానికి చిన్నచూపేల?

- బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలి
- ఎన్నికల హామీలు విస్మరించారు
- ప్రభుత్వ కళ్లు తెరిపించేలా ఆందోళన చేస్తా
- ముస్లిం మేధావుల ఫోరం డిమాండ్

**రాజధాని ప్రతినిధి :** ముస్లింల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని పలువురు ముస్లిం మేధావులు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మైనార్టీల ఓట్ల కోసం మేనిఫెస్టోలో అనేక వరాలు ప్రకటించి, నేడు వాటిలో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. జనాభా ప్రాతిపధికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల కోసం ముస్లిం లంతా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఆందోళన చేపట్టాలని పేర్కొన్నారు. ముస్లిం మేధావుల ఫోరమ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ముస్లింలకు జరుగుతున్న అన్యాయం, అమలు కాని రిజేర్వేషన్లు, సంక్షేమ పథకాలపై చర్చించి, కార్యాచరణ రూపొందించేందుకు గురువారం మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలోని గుప్తా కళ్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లిం మేధావులు, పలు మైనార్టీ సంఘాల ప్రతినిధులు హాజరై ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు జలీల్‌ఖాన్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల కన్నా ముస్లింలు చాలా దీనావస్థలో వున్నారన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు ప్రవేశ పెట్టిన 4 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి ఇచ్చేందుకు సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఫోరమ్ ప్రతినిధులు ఎంఏ మతీన్, ఫారూఖ్ ఘబ్లీ, సయ్యద్ అల్తాఫ్ ,ఎం.డీ హనీఫ్ ,డాక్టర్ ఎంఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



Edited with the trial version of
Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# రాజధాని వార్తలు

## అర్హులకే రిజర్వేషన్లు వర్తింప చేయాలి

రిజర్వేషన్లు కావాలని కులాలన్నీ క్యూలు కడుతున్నాయి. అదేమంటే మాకులంలో పేదవారు లేరా అంటారు... అయితే ఇక్కడ గుర్తుంచుకోవాలసిన ముఖ్య విషయం రిజర్వేషన్ల ప్రాతిపదిక కేవలం ఆర్థిక వెనుక బాటే కాదు. అక్షరానికి, ఆత్మాభిమానానికి, సంపదకు, సమాజానికి దూరంగా ఉండటం మొదటి కారణం. సాటి మనిషిగా ఏమాత్రం గౌరవ అభిమానాలకు నోచుకోకపోవడం, సంపద సృష్టించిన వారికి దాన్ని అనుభవించే అర్హత లేకపోవడం, వెలివేసిన వాడల్లో పశువుల కన్నా హీనంగా బ్రతకటం, అంటరానితనానికి గురవడం రిజర్వేషన్లకు మూల కారణం. అదీకూడా రాజ్యాంగకర్త కేవలం పదేళ్లు మాత్రమే కల్పించి వీరికీ సమాజంలో ప్రాతినిధ్యం కల్పించాలనుకున్నారు. సమ సమాజంలో వీరిని సభ్యులుగా చేసి ఒకే జాతిగా ముందుకు నడిపి ప్రపంచంలో భారత్‌ను ఎదురులేని శక్తి చేయాలని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచించారు. దళిత, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించాలన్న ఆయన కోరికను అగ్రవర్గాలు కొరగాకుండా చేశారు.

మైదాన ప్రాంతాల ప్రజలకు భిన్నంగా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా విద్యాపరంగా వెనకబాటుకు గురై ఎటువంటి అభివృద్ధికీ నోచుకోని గిరిజన, సంచార జాతులను షెడ్యూల్డు జాతులుగా, కులవివక్షతో అంటరాని వారిగా మిగిలినవారిని షెడ్యూల్డు కులాలుగా రాజ్యాంగంలో నమోదు చేసి వారికి విద్యా,ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. ఇదే స్ఫూర్తితో రాజ్యాధికారం లేని బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించారు. ఆర్థిక వెనుకబాటులో ఉన్న అన్ని కులాలకు ప్రభుత్వం ఈబీసీ (ఎకనామికల్లీ బాక్‌వర్డ్) రిజర్వేషన్ కల్పిస్తోంది. ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా నిధులు కెటాయించి వారికి సమాజంలో సమున్నత స్థానం కల్పిస్తోంది.

అయితే అవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. షెడ్యూల్డు కులాలు, తరగతుల వారు ఇప్పటికీ అగ్రకులాల వారి దురహంకారానికి బలవుతూనే ఉన్నారు. దానికి ఉదాహరణే చుండూరు, కారంచేడు సంఘటనలు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఆత్మగౌరవానికి దూరంమై, మేథోశక్తి గుర్తింపుకు నోచుకోక ఆత్మనూన్యతతో చనిపోయేవారు ఇప్పటికీ ఎంతోమంది ఉన్నారు. దాని తార్కాణమే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధనా విద్యార్థి రోహిత్ ఆత్మహత్య . పుట్టుకతో ఎన్నో శ్రమలు అనుభవించి ఒక మంచి స్థాయికి చేరుకున్నప్పటికీ అవమానాలను మాత్రం అణగారిన జనం జయించలేక పోతున్నారు. బ్యాంకు అధికారులు, తాహశీల్దారులు కూడా గ్రామీణ, చిన్నపట్టణాల్లో అద్దెకు ఇళ్లు దొరకక ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్రంలోని అన్నిపాఠశాలల్లో అమలు జరిపినప్పుడు కూడా అగ్ర తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అంటరాని కులాలతో కలసి తింటానికి ఒప్పుకోలేదు. అది జిల్లా, రాష్ట్ర అధికారులకు పెద్ద తల నొప్పినే తెచ్చింది.

ఈ మధ్యకాలంలో పౌర సమాజం మరో కోణాన్ని చూసింది. కులాల ప్రస్తావనలో పెద్దకులంగా, రిజర్వేషన్ల విషయంలో వెనుకబడిన వారిగా గుర్తించాలని విధ్వంసాన్ని సృష్టించారు. ఊరిపెద్దలువారే, పెత్తనం వారిదే, సంపద వారిదే, నోరూ వారిదే...ఇప్పుడు రిజర్వేషన్లు అడుగుతున్నవారు వారే...అకస్మాత్తుగా రైలురోకో చేపట్టి రత్నాచల్‌లోని ప్రయాణీకులను ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని పరిగెత్తేలా, పోలీసులపై దౌర్జాన్యానికి పూనుకున్న వర్గాన్ని ఇంతవరకు ఏ నాయకుడు, అధికారి వారిని వేలెత్తి చూపలేని స్థితిలో ఉన్నారంటే అగ్రకులాల శక్తి ఏమిటో తెలుస్తోంది. ఇదే జిల్లాలో అదే వర్గానికి చెందిన నాయకుడు తన మాట వినలేదని ఒక దళిత యువకుడికి గుండు కొట్టించాడు. మరొక వ్యక్తిని గుమ్మం ముందే పెట్రోలు పోసి తగుల బెట్టించాడు. ఒక్కో పార్టీ ఒక్కో కులానికి ప్రాతినిధ్యం వహిస్తూ, మైనార్టీలకు, అణగారిన వర్గాలను దగా చేస్తున్నాయి.

రిజర్వేషన్లు తీసేయండి సంపద అందరికీ సమానంగా పంచండి అని కమ్యూనిస్టులు చెబుతున్నారు. అసలు ఇన్నేళ్లు రిజర్వేషన్లు అమలు చేయడమే తప్పిందం. నిష్పత్తి ప్రకారం అణగారిన కులాల వారిని సంఘపౌరులుగా తీర్చిదిద్దలేకపోవడం కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిజరూపం. ఈ సమయంలో రాజకీయ పండితులు, విద్యా, సామాజిక వేత్తలు దీనిపై లోతైన విశ్లేషణ జరిపి, అర్హులైన వారికి రిజర్వేషన్లు కల్పించి సమాజాభివృద్ధికి దోహదపడాలి.

# తుర్లపాటీయం

**రాజీవ్ గాంధీపై ఎన్.టి.ఆర్ వ్యాఖ్య**

ఒకసారి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రధాని రాజీవ్ గాంధీని దేశద్రోహి అని నిందించారు. అది నాకు బాధ కలిగించింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి సాక్షాత్తు దేశ ప్రధానిని విమర్శించ వచ్చు కాని "దేశద్రోహి" అని ఎలా దూషిస్తారు? అది రాజ్యాంగ విరుద్ధం కాదా? ఎన్టీఆర్ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? అంటూ నేను ఆనాడు దేశంలోని కాంగ్రేసేతర ముఖ్యమంత్రులు అందరికి లేఖలు రాశాను. వారిలో ఎవ్వరూ స్పందించలేదు. ఒక్క కర్ణాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే మాత్రం తాను ఆ వ్యాఖ్యతో ఏకీభవించడం లేదని సమాధానం రాశారు.

**పార్టీ మార్పిడులు**

మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలలో అవినీతి, పార్టీల మార్పిడి సమస్యలు తీవ్రమైనవి. వీటిలో పార్టీల మార్పిడి మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య బద్ధమైన ప్రభుత్వాలను అశాంతి, అస్థిరత్వాలతో కదిపి, కుదిపి వేస్తున్నాయి. ఒక పార్టీ పట్ల అభిమానంతో, విశ్వాసంతో ఆ పార్టీ అభ్యర్థులను ఓటర్లు గెలిపిస్తే, వారిలో కొందరు తమ సభ్యత్వ కాలపరిమితి పూర్తి అయ్యేలోగా రెండు మూడు పార్టీలు మారడం కద్దు. ఈ వ్యాధి పార్టీల మార్పిడి చట్టం రాకముదు మరీ ఉధృతంగా ఉండేది! ఈ ప్లేటు ఫిరాయింపుల వల్ల ఎన్నో ప్రభుత్వాలు కూలిపోతూ వచ్చాయి. ఈ ఫిరాయింపుల నిరోధానికి చట్టం తీసుకు రావాలని చాలా కాలంగా ఆలోచనలు, ప్రయత్నాలు జరుగుతూ వచ్చినా, ఏవో కారణాల వల్ల అవి కార్య రూపం ధరించలేదు. ఒకసారి సోషలిస్టు నాయకుడు శ్రీ మధు లిమాయే అలాంటి చట్టం "వ్యక్తి స్వేచ్ఛకు" భంగం అనే కారణంతో ఆ బిల్లును అడ్డుకున్నారు. అక్కడితో ఆ బిల్లు అటక ఎక్కింది–లోక్‌పాల్ బిల్లు వలెనె.

1970 దశకంలో నేను ఆనాటి ప్రముఖ జాతీయ నాయకులు లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్, కాశ్మీర్ కేసరి షేక్ అబ్దుల్లా, జనతా పార్టీ అధ్యక్షుడు శ్రీ చంద్ర శేఖర్ ప్రభృతులకు పార్టీల మార్పిడి బిల్లుపై వారి అభిప్రాయాలు ఏమిటని ప్రశ్నించగా, వారందరూ కూడా ఆ బిల్లు కోసం తాము ఎదురుచూస్తున్నామని, అలాంటి బిల్లునుతాము తప్పక స్వాగతిస్తామని సమాధానమిచ్చారు.

తరువాత ఆ లేఖలను 1985లో ప్రధాని రాజీవ్ గాంధీకి పంపాను. రాజీవ్ గాంధీ పార్టీల మార్పిడి బిల్లు కోసం గట్టిగా ప్రయత్నించి, ఎట్టకేలకు 1986లో పార్టీల మార్పిడి చట్టాన్ని తీసుకు వచ్చారు. అయితే, ఆ బిల్లులో కొన్ని లసగులు లేక పోలేదు. మరి, అన్ని పార్టీలు, అన్ని వర్గాల వారి అభిప్రాయాలను సమన్వయ పరచడానికి జరిగిన ప్రయత్నం వల్ల ఆ చట్టం ఇప్పటి రూపం ధరించింది. ఈ చట్టాన్ని ఇంకా కఠిన తరం చేస్తే కాని దాని నుంచి ఆశించిన సమగ్ర ఫలితం లభించదు.

**'పద్మ శ్రీ'తుర్లపాటి కుటుంబం**

***నా మనుమడు రాసిన నా జీవిత చరిత్ర :***

నా కుమారుడు జనహర్‌లాల్ పుత్రుడు కృష్ణ కుమార్ కాన్వెంట్‌లో చదివాడు. అయితే, అతను మేధావి. నా ప్రభావం అతని పై ఎక్కువ పడింది. నా సభలు, సమావేశాలు, నన్ను కలుసుకొనడానికి వచ్చే వారితో నేను జరిపే చర్చలు– ఇవన్నీ అతడిని కొంతవరకు ప్రభావితునికి చేశాయి. జాగ్రత్త పరుడు, తెలివిగలవాడు కావడం వల్ల తెలుగు భాషపై పట్టు సాధించాడు. అతను తన 14, 15 సంవత్సరాల వయస్సులోనే తన పెన్నును మైకు వలె నా నోటివద్ద పెట్టి, నన్ను మాక్ ఇంటర్‌వ్యూ చేసేవాడు!

అతనికి ఇంటర్ పూర్తి చేసి, ఇంజనీరింగ్ సీటు వచ్చేలోగా ఎందుకు కలిగిందోకాని, నా జీవిత చరిత్ర రాయాలన్న కోర్కె కలిగింది. ఒక రోజున అకస్మాత్తుగా నా వద్దకు వచ్చి, ని మీ జీవిత చరిత్ర రాశాను, తాతాగారూ! అది ప్రింట్ చేసి పెట్టాలి.ః అని అడిగాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. నా జీవిత చరిత్ర ఏమిటి,? తను రాయడమేమిటి ? వెంటనే నేను స్క్రిప్టు చూసి, ఒక చోట దిద్దబోయాను.నితాతగారూ! మీరు ఇందులో ఒక్క అక్షరం మార్చినా, మీరు దాన్ని ప్రింటు చేయనక్కర్లేదు అంటూ స్క్రిప్టు తీసుకువెళ్లాడు. అతని పట్టుదలకు, ఆత్మవిశ్వాసానికి నాకు సంతోషం కలిగింది.

ఆ స్క్రిప్టులో తప్పులు లేవు. కాకపోతే, కొన్నిచోట్ల నా భావాలకు భిన్నంగా ఉన్నట్టు కనిపించింది. అలాంటి చోట్ల చిన్న చిన్న సవరణలు చేయాలని నాకు అనిపించింది. తాను ఒప్పుకుంటేగా? అతను పెట్టిన షరతులకు అంగీకరించి, ఎలాంటి మార్పులు చేయకుండా నా జీవిత చరిత్రను నేనే ప్రింటు చేయించాను.! అప్పుడు నా మనుమడికి 17 సంవత్సారాలు. ఆ స్క్రిప్టును విజయవాడ విశ్వటైప్ ఇన్‌స్టిట్యూట్ యజమాని శ్రీ రాఘవ రెడ్డికి ఇచ్చి, ముద్రించాలని కోరాను. అంత చిన్నవయస్సులో నా జీవిత చరిత్ర రాయడానికి సాహసించిన అతని చొరవకు ముచ్చటపడిన ఆయన ఉచితంగానే ముద్రించి ఇచ్చారు।

**నా మిత్రత్రయం :** ఎవరైనా ముందుకు వెళ్ళడానికి సాధారణంగా బంధువుల కంటె మిత్రులే కారుకులు. అందువల్లనే "స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం" అన్నాడొక కవీంద్రుడు. నాకు మొదటి నుంచి మిత్రులు తక్కువ. అభిమానులే ఎక్కువ. వారిలో కొందరు వీరాభిమా నులు! మరి కొందరు మూఢాభిమానులు! ఇది ఆత్మస్తుతి కాదు– వినమ్రతతో చెప్పే మాట ఆ నా మిత్రుల పట్ల గౌరవాభిమానాలలో, కృతజ్ఞతతో చెప్పేమాట ! వారిలో ముగ్గురు అగ్రగణ్యులు – వల్లభనేని లక్ష్మీదాసు, జె.ఎస్.టి. శాయి, మల్లాది రామకృష్ణ! వీరు నా చిన్న నాటి నుంచి ఇప్పటివరకు నాకు హితులుగా, స్నేహితులుగా, వీరాభిమానులుగా ఉన్నారు. మా అనుబంధం అనిర్వచనీయం. వీరు ముగ్గురివీ మూడు విభిన్నమైన వ్యక్తిత్వాలు. నిజానికి ఒక ఇంగ్లీషు సూక్తి పేర్కొంటున్నట్టు, ఏ మనిషికి ఆ మనిషి ఒక టైప్. వీరిలో లక్ష్మీదాసు ఆవేశపరుడు. నన్ను గురించి నా సన్నిహిత బంధు వులైనా పల్లెత్తు మాట అంటే, తానే రేసు కుక్కవలె వారిపై విరుచుకు పడేవాడు!



చాంద్రమానేన శ్రీ మన్మథనామ సంవత్సరం

# నాడీ జ్యోతిష్యం

**2016 జనవరి**
**ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు**

**అన్ని రాశులవారు వయస్సు బట్టి చూసుకోవాలి**

**ఆకుల వేణునాథ్ సిద్ధాంతి**, cell : 9032450197

1. 7,5,13 సం.. వయస్సువారి దేవుని యొక్క సహాయం. లక్కీ చాన్స్‌లాటరీయోగం అందరి యొక్క సహాయ సహకారాలు మంచి విద్యాయోగం అనుకూలంగా జీవితం ఉంటుంది. అమ్మాయిలు మొండిపట్టువదిలిన నిధానంగా అలోచించి జాగ్రత్తలు నడుచుట అబ్బాయిలు కూడా మంచి విధానంతో ప్రతి విషయంలో పనులు ముందుకు సాగుతుంది. వారి చేతుల మీద కార్య లాభాలు ఉంటాయి. అన్నీ విధాలుగా సంతోషముగానే ఉంటారు.

2. 14 నుండి 20 సం... వయస్సు వారు స్త్రీలకు వివాహ ప్రయత్నాలు చేయుదురు. విద్యార్థులకు విద్య కంటే ధన సంపద గురించి ఆలోచనలు చేస్తారు. భవిష్యత్తు మీద అంచనాలు, కోరికలు జీవితం స్థిమితంగా ఉండుటకు ప్రయత్నం చేస్తారు. స్త్రీలకు తల్లితండ్రులు, అందరి ప్రోత్సాహం అవకాశాల కోసం దైవక్రియలు చేయాలిఅవి రాహు, కేతు, శని శాంతి అవసరం –దక్షిణామూర్తి పూజ చేయాలి.

3. 20 నుండి26 సం.. వయసువారికి అకస్మాత్తుగా సమస్యలు రావచ్చు. అవమానాలు అపనిందలు ఉండవచ్చు. లేని శత్రువు, ఋణ, రోగ భయం లేకుండా సమస్యలు ఎదుర్కొని అంతర్గత: బహిర్గత: బలం చేకూర్చుకుని జీవితాన్ని శుభమార్గంలో నడిపింపించుకొందురు. కుటుంబవ్యవస్థను కాపాడుకుని ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగుతారు. తంతంతఈ వయస్సు వారు నవగ్రహశాంతులు చేయడం అవసరం.

4. 27 నుండి 33 సం.. వయస్సు వారికి వివాహప్రయత్నాలు ఫలించుట. అన్ని రకముల సర్వసుఖములు ఉన్నప్పటికి ఆత్మధైర్యంతో సమస్యలు పూర్తిగావింతురు. అందరూ అన్నీ విషయాలలో సంతృప్తి చేయుట జీవితమును సుఖవంతంగా చేసుకొంటారు.

5. 34 నుండి 39 సం.. వయస్సు స్త్రీలు , పురుషులకు వివాహాది శుభకార్యలాయాలు అన్ని రకముల సర్వసుఖములు ఉన్నప్పటికి కుటుబంలో అప్ర అవమాన పరిస్థితులు ఆత్మధైర్యంతో సమస్యలు పూర్తిగావింతురు. తొందరపాటుతో మాట చలామణితో జీవితం సాగుట స్త్రీ, పురుషలలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు స్త్రీలు నిదానంగా పోరాటంతో గెలుచుట నవగ్రహశాం తులు అవసరం.

6. 40 నుండి 45 సం. వయస్సు వారికి జీవితం అంటే భయంగా అనిపించుట ప్రపంచంలో అన్ని అనుభవాలు తెలుసుకొనుటకు, స్త్రీ సంతాన అభివృద్ధికోసం కృషి చేయుట అవమానాలు పొందినప్పటికి దైవక్రియలు వల్ల ఆత్మాస్థైర్యంతో ముందుకు సాగుట, దైవక్రియలు చేయాలిఅవి రాహు, కేతు, శని శాంతి చేయటం మంచిది.

7. 46 ను 52 సం.. వయస్సు వారికి స్త్రీలు కుటుంబము పట్ల మొండిపట్టువదిలిన నిధానంగా అలోచించి సంతాన విషయాలలో కొంత చికాకులు. స్వార్థం నిదానం ఆలోచనలతో జీవితం అనుభవింతురు. పురుషులు డైరెక్టర్ గా వ్యవహరించి సమస్యలను తెచ్చుకుంటారు. ఎంత కష్టపడినా అసంతృప్తి ప్రధానంగా రాహు, కేతు, శని శాంతి చేయటం మంచిది.

8. 52 నుండి 58 సం... వయస్సు వారికి గృహ వాహన సదుపాయాలు తల్లీ, తండ్రి కుటుంబ వ్యవస్థలలో వారికి రాజకీయవేత్తలకు, మరియు ఉద్యోగస్తులకు అడగడుగునా టెక్షన్

కోటీశ్వర్లు ఆర్థిక అభివృద్ధి వున్నవారికి అందరికి అధికమైన టెంక్షన్ ఉండవచ్చు ఈ విధంగా బాధపడతారు.రహస్యంగా స్త్రీలు ఆలోచనలు మాత్రం సఫలం కాగలవు. మొత్తం మీద స్త్రీలకు లాభం కలుగవచ్చు. నవగ్రాహాల శాంతులు చేసుకొనుట మంచింది.

9. 58 నుండి 65 సం.. వయస్సు వారికి ఎంత ధైర్యంగా ఉన్నా మాట, ఓదార్పు సర్వసుఖసౌఖ్యాలు జీవితమే కోల్పోతున్నట్లు మనసుకు తెలియని శక్తి నిర్వరాయం చేస్తున్నట్లు అన్నీ వర్గాల వారికి భిన్నాభిప్రాయాలు ఉన్న వారికి అందరూ కలిసి సమిష్టిగా ఆలొచించెదరు. పురుషలలో యుద్ధ నైపుణ్యత స్త్రీలు నిధానముగా ప్రవర్తించి. జీవన పోరాటం చేస్తారు.

10. 65 నుండి 72 సం... వయస్సు వారికి ఆందోళన, అంతర్గత తొందరపాటుతో. మాటతో ప్రతి వ్యవహారం చక్కదిద్దుకొనుట. మెండిగా జీవన పోరాటం. కాని శత్రువుల చేతులో ఉన్నట్లు అనిపించిన యోగం అదృష్టంతో కొంత మంది లాభం పొందుట స్త్రీలు అధికలాభం పొందుట స్వార్ధం, నిదానం, సమస్యలు పూర్తిచేసుకొందురు. మొత్తం మీద అందరూ సుఖ సౌఖ్యాలు సదా లాభాలు దినదినాభివృద్ధి దైవక్రియలు చేయుట ఈ వారం స్త్రీలకు లాభంగా ఉండవచ్చు.

## నేత్ర వైద్య శిబిరం... 71 మందికి పరీక్షలు...

**పిఠాపురం రూరల్, రాజధాని ప్రతినిధి :** పిఠాపురం మండలం రాపర్తి పంచాయతీ వద్ద శుక్రవారం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పిఠాపురం సీహెచ్‌ఎన్‌సీ కంటి వైద్య నిపుణులు ప్రకాష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 71 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో కొంత మందికి కళ్లజోళ్లు అవసరమైనట్లు గుర్తించారు. అలాగే 8 మంది వృద్ధులకు శస్త్ర చికిత్సలు చేయాలన్నారు. వారం, పది రోజుల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తాంమని, వాటిని గ్రామాల్లో ఏఎన్ఎంల ద్వారా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కె.కిశోర్, పీఎన్‌వి.రత్నకుమారి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి..

**పిఠాపురం టౌన్, రాజధాని ప్రతినిధి :** పిఠాపురంలోని రాపర్తి రోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. సుమారు 3.30 గంటల ప్రాంతంలో లారీ, కారు ఢీ కొట్టుకోవడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన ఫిజియోథెపిస్టు కాకర్లపూడి సందీప్ వర్మ (29)



తన కుమార్తెను చూసేందుకు విజయనగరం జిల్లాకు కాకినాడ నుంచి స్విఫ్ట్ కారులో బయలుదేరగా, కత్తిపూడి వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న లారీ కారును ఢీ కొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ఉన్న వర్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్సై వి.కోటేశ్వరావు తెలిపారు.

## ఆధ్యాత్మికతతోనే నిజమైన ఆనందం

**డాక్టర్ ఉమర్ ఆలీషా**



డా॥ ఉమర్ ఆలీషాను దర్శించిన మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు

**పిఠాపురం రూరల్, రాజధాని ప్రతినిధి :** మానవుడు ఆధ్యాత్మిక మార్గంలో పయనించడం ద్వారా పరమాత్మ శక్తిని పొంది శరీరాన్ని, మనస్సును, ఆత్మను పరిశుద్ధం చేసుకుని తద్వారా స్వచ్ఛమైన ఆనందాన్ని పొందుగలుగుతాడని పీఠాధిపతి డా॥ ఉమర్ ఆలీషా అనుగ్రహభాషణ చేశారు. చిత్రాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో శ్రీ విశ్వ విజ్ఞాణ విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో వార్షిక మహాసభలను 9,10, 11వ తేదీల్లో నిర్వహించారు. ఈ సభల ముగింపు వేడుకల్లో పీఠాధిపతి ఆలీషా ప్రసంగిస్తూ మానవుని దైనందిన జీవితం ఆనందంగా సాగాలంటే జ్ఞానమనే ఇంధనం అవసరమని అన్నారు. అందుకు మానసిక శక్తి సామర్థ్యాలు పెంపొందించుకుని జ్ఞానయోగిక సాధన ద్వారా పరిణితి చెంది ఆత్మ జ్ఞానిగా మారాలన్నారు. సహన శక్తి ద్వారా ఇది సాధ్యపడుతుందని తెలిపారు. అలాగే కాలాన్ని సద్వినియోగ పర్చుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన నా మొక్క – నా శ్వాస అనే కార్యక్రమం ద్వారా ప్రతి సభ్యుడు ఇంటికి ఒక మొక్కను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, అటవీ సంరక్షణ ద్వారా జంతువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సామాజిక, ఆధ్మాత్మిక చైతన్యం అలవర్చుకోవడం ద్వారా నైతిక విలువలతో కూడిన జీవనాన్ని కొనసాగించాలని భక్తులకు హితవు పలికారు. ఈ మహాసభల్లో 405 మంది సభ్యులు నూతనంగా మహామంత్రం స్వీకరించారు. వేలాదిగా వచ్చిన సభ్యులకు ఉచిత భోజన సదుపాయంతో పాటూ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పీఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు నామన రాంబాబు, రంగరాయ మెడికల్ కాలేజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాలక్ష్మి, పిఠాపురం మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు తదితరులు గురువర్యులను దర్శించుకున్నారు.

# తంగెళ్లమూడిలో అభివృద్ధి పనులు



గ్రామ సర్పంచ్ వెంట్రపాటి నాగేశ్వరమ్మ



ఎంపిటిసి తంగిరాల సురేష్

- రూ.90 లక్షల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
- రూ.19 లక్షలతో అంతర్గత రోడ్ల, డ్రెయిన్‌ల నిర్మాణాలు
- ఎమ్మెల్యే బడేటి బుజ్జి సహకారం

**(రాజధాని వార్తలు–ఏలూరు) :** ఏలూరు నియోజకవర్గం పరిధిలోని తంగెళ్లమూడి గ్రామంలో రూ.19 లక్షలతో పలు అభివృద్ధి పనులు నియోజకవర్గం శాసనసభ్యుడు బడేటికోట రామారావు (బుజ్జి) సహకారంతో చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ వెంట్రపాటి నాగేశ్వరమ్మ రాజధాని ప్రతినిధికి వివరించారు. గ్రామాభివృద్ధికి ఈ నిధులు మంజూరు చేసి గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా తీర్చిదిద్దడానికి నియెజకవర్గ ఎమ్మెల్యే బడేటి బుజ్జి గ్రామ పంచాయతీ పాలక వర్గసభ్యులు, జన్మభూమి కమిటీ, ఎంపిటిసి, జడ్పీటీసీ ,టిడిపి కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అధికారులు పూర్తి సహాయ సహాకారాలు అందిస్తున్నారని ఆమె వివరించారు.

గ్రామంలో 13వ ఆర్థిక సంఘం, 14వ ఆర్థిక సంఘం, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టినట్లు ఆమె తెలిపారు. 13,14వ ఆర్థిక సంఘానికి చెందిన రూ.9 లక్షలకు గ్రామ పంచాయతీ నిధులు రూ.9 లక్షల రూపాయల సాధారణ నిధులు జోడించి గ్రామంలో రోడ్లు ఉన్న ప్రాంతంలో కచ్చాడ్రెయిన్‌ల స్థానే పక్కా డ్రెయిన్‌ల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు.

రూ.90 లక్షల రూపాయలు వివిధ అభివృద్ధి పనులకు నాబార్డ్, జిల్లా పరిషత్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలలో 14 లక్షలు డ్రెయిన్‌ల నిర్మాణాలకు, మరో రూ.25 లక్షలు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు జిల్లా పరిషత్ నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు ప్రస్తుతం గ్రామంలోని 5వ వార్డులో డ్రెయిన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు.


గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా పాత విద్యుత్ స్తంభాల స్థానే కొత్త వాటిని పునర్నిర్మించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యే బడేటి కోట రామారావు (బుజ్జి) వివరించడం జరిగిందన్నారు. గ్రామంలో అర్హులైన మహిళలకు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్‌లు, 26 రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు ఉన్న 85 పెన్షన్‌లకు అదనంగా మరో పెన్షన్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

.గ్రామం అభివృద్ధికి నియోజకవర్గ శాసన సభ్యులు బడేటిబుజ్జి ప్రత్యేక దృష్టి సారించారని ఆయన కృషి అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధికి గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు వెంట్రపాటి ముత్యాలబాబు, జన్మభూమి కమిటీ, ఎంపీటీసీ తంగిరాల సురేష్, బెజ్జం అచ్చాయమ్మా, జెడ్పీటీసీ మట్టా రజేశ్వరిల సహకారంతో పాటు గ్రామ పంచాయితీ పాలక వర్గం ఉప సర్పంచ్ నెర్సు గోకుల్ గ్రామ కార్యదర్శి పి. సురేష్ కుమార్‌ల సహకారంతో ఈ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి సమిష్టి కృషితో గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సర్పంచ్ నాగేశ్వరమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# జీవనశిల్పి జిడ్డు కృష్ణమూర్తి

**ఫిబ్రవరి -17న ఆయన వర్ధంతి**



**జిడ్డు కృష్ణమూర్తి ఒక గొప్ప తాత్వికవేత్త.. మానసిక, ఆధ్యాత్మిక విషయాలపై ఆయన చేసిన ప్రసంగాలు ఒక విప్లవం. సుఖం, దు:ఖం, బాధ వంటి అంశాలపై తనదైన శైలిలో వివరణలు ఇచ్చి అనేక ప్రాపంచిక విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈయన మన తెలుగువాడే..**

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో జిడ్డు కృష్ణమూర్తి మే 12, 1895న ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన ఓ ప్రముఖ తత్వవేత్త. 1929 నుండి 1986లో తాను మరణించే వరకు ప్రపంచం నలుమూలల ప్రయాణిస్తూ తాత్విక, ఆధ్యాత్మిక విషయాలపై అనేక ప్రసంగాలు చేశారు. ఆయన స్పృశించిన ముఖ్యాంశాలు- మానసిక విప్లవం, మనోభావ విచారణ, ధ్యానం, మానవ సంబంధాలు, సమాజంలో మౌలిక మార్పు. మదనపల్లిలో జన్మించినా ఆయన కుటుంబం మాత్రం మద్రాసులో నివాసం పెట్టింది. మద్రాసులోని "అడయారు" దివ్యజ్ఞాన సమాజంకి అంతర్జాతీయ కేంద్రం. అనీ బిసెంట్ దానికి అధ్యక్షురాలు. కృష్ణమూర్తి, ఆయన తమ్ముడు నిత్యానంద కలసి అడయారులో నది - సముద్రంలో కలిసే చోట నిత్యమూ ఆడుకుంటూ ఉండే వారు. తరువాత వారిద్దరు విద్యార్జన కోసం ఇంగ్లాండు వెళ్లారు. పారిస్‌లోని సాంబాన్ విశ్వ విద్యాలయంలో కృష్ణమూర్తి సంస్కృతం, ఫెంచి భాషలను అధ్యయనం చేశారు. తన తమ్ముడు అంటే ఆయనకి ఎనలేని ప్రేమ. 1922లో కాలిఫోర్నియా కొండల్లో ఒక ఇంటిలో ఇద్దరూ నివాసం ఏర్పరచుకున్నారు. 1925లో తమ్ముడు నిత్యానంద మరణించాడు. తమ్ముని మరణం కృష్ణమూర్తిని శోకం లో ముంచింది. ఆ దు:ఖావేశంలో తనకు కనిపించే బాటసా రులందరినీ తన తమ్ము దేమైనా కనిపించాడా? అని అడిగేవాడు. చిన్నప్పటి నుంచీ ఆయన అన్ని విషయాలను శంకించేవారు. తనకు ప్రత్యక్ష ప్రమాణం దొరికినప్పుడు మాత్రమే దానిని నమ్మేవాడు. కరడు కట్టిన సాంప్రదాయ వాసనలతో బూజు పట్టిపోతున్న మతాలపై ఆయనకు నమ్మక ముండేది కాదు. థియోసాఫికల్ సొసైటీ నమ్మే గుప్తవిద్యపై కూడా ఆయనకు నమ్మకముండేది కాదు. ఈయనకు జగద్గురువని ప్రచారం చేసినా దానిలోనూ ఆయనకు నమ్మక ముండేదికాదు. తమ్ముని మరణంతో ఆయన దృక్పథం మరింత బలీయమైంది. కృష్ణమూర్తిని జగద్గురువుగా భావించిన డాక్టర్ అనిబిసెంటర్ " ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఇన్ ది ఈస్ట్ " అనే ఒక అంతర్జాతీయ సంఘాన్ని స్థాపించి, కృష్ణమూర్తిని దానికి అధ్యక్షుడిని చేశారు. కొంతకాలం వరకూ కృష్ణమూర్తి అభ్యతరం చెప్పలేదు. అంతవరకూ తాను కృష్ణమూర్తినా లేక జగద్గురువునా అనే విషయంలో ఏ నిర్ణయానికి రాలేకపోయారు. సోదరుని మరణం ఆయనలో తెచ్చిన దు:ఖం కొంతకాలానికి ఆయనలో ప్రతిక్రియను తెచ్చింది. దు:ఖం సమసిపోయి ఒక విధమైన ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని తీసుకువచ్చింది. ఆయనలో జీవం ప్రవేశించింది. తాను జగద్గురువు అని అనిబిసెంట్ చేసిన ప్రచారాన్ని కాదన లేదు. ప్రపంచంలో ఎక్కడలేని గౌరవాలు ఆయనకు జరగసాగాయి. ఆయన నడిచేదారిలో గులాబి పూలు పోసేవారు.

**సౌధాన్ని.. వేల ఎకరాలను వద్దన్నారు..**

హాలెండ్‌లో ఒకరు బ్రహ్మాండమైన సౌధాన్ని, అయిదువేల ఎకరాలు భూమిని సమర్పిస్తామంటే వద్దని నిరాకరించారు. ఇటువంటి అద్భుతమైన సన్మానాలు జరుగుతున్నప్పటికీ కృష్ణమూర్తి ఆ గౌరవాలు విలువ ఇవ్వక, తన ఎప్పటి సాదా జీవితాన్ని గడపసాగారు. చివరికి అధికారపూర్వకంగా జగద్గురు పీఠాన్ని స్వీకరించమనే ఒత్తిడి ఎక్కువైంది. చివరికి 1929లో హాలెండ్‌లోని ఆమెన్‌లో తాను జగద్గురువును కాదని ప్రకటించి "ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ది ఈస్ట్" ను రద్దు చేశాడు. తాను జిడ్డు కృష్ణమూర్తినే కాని జగద్గురువును కానని ప్రకటించారు. దీంతో ఎక్కడివారు అక్కడే అసంతృప్త హృదయాలతో మౌనం దాల్చారు. అప్పటి నుంచి కృష్ణమూర్తి స్వతంత్ర్య మానవుడు, స్వేచ్ఛా చింతకుడు, నవమానవతావాది. ఎవరి అభిమానాలను ఆశించక, ఎవరి సహాయాలనూ కాంక్షించక, ఎవరి నిందనలనూ లెక్కచేయక, జీవన సంగ్రామపు వాస్తవాన్ని గుర్తించి, గొప్ప జీవన శిల్పిగా రూపొందారు. మనిషి తనంతట తానుగా భయం, కట్టుబాట్లు, అధికారం, మూఢవిశ్వాసాల నుండి విముక్తి చెందాలని ఉద్బోధించారు.

**మహాపురుషుడవుతాడన్న లెడ్ బీటర్**

కృష్ణమూర్తిని ఆయన బాల్యంలో చూసిన లెడ్ బీటర్ (దివ్యజ్ఞాన సమాజోద్యమ నేత. మేడమ్ బ్లావెట్‌స్కీతో పని చేసినవారు), ఆ బాలుని చుట్టూ కనిపించిన అసాధారణ కాంతి వలయాన్ని గమనించి అతడు మహాపురుషుడవుతాడని ప్రకటించారు. కృష్ణమూర్తి స్వతంత్ర్య భావాలు త్వరలోనే బయటకువచ్చి ఆయన విశిష్టమూర్తిమత్వం లోకానికి వెల్లడైంది. కృష్ణమూర్తి గారు ఎక్కువకాలం విదేశాలలో గడిపారు. కానీ ప్రతి సంవత్సరం భారతదేశానికి వస్తుండేవారు. 'ఆంధ్రప్రభ' సచిత్ర వార పత్రిక సంపాదకులుగా ఉన్నప్పుడు, భారతదేశంలో చాలా కాలం గడిపారు. గుప్త ఆధ్యాత్మికసాధనలో కొంత పురోగమనం సాధించారు. ఆయన తత్వం ఇలా ఉంటుంది.. అసలైన విప్లవం జరగవలసినది హృదయపు లోతులలో. మనిషిలో సమూలమైన పరివర్తన కలగపోతే ఈ యుద్ధాలు, ఈ హింసాకాండ, ఈ విధ్వంసము ఇట్లాగే కొనసాగుతూ ఉంటాయి. రాజకీయ, ఆర్థిక విప్లవాలు కానీ, సామాజిక సంస్కరణలు కానీ పరివర్తన తేలేవు. నూతన ఆదర్శాలు, మతాత్మకమైన ఆశయాలు అవలం భించినా, కొత్త సిద్ధాంతాలతో, కొత్త పద్ధతులలో మనిషిని నిర్బంధించినా ఇది జరగదు. తనని తాను పూర్తి గా అవగాహన చేసుకుంటూ హృద యంతో స్పందిస్తూ జీవించటంలోనే పరివర్తన సాధ్యమవుతుంది.

**ఆయనపై తెలుగులో వెలువడిన కొన్ని పుస్తకాలు**

కృష్ణమూర్తి తత్వం- పరిచయం సంపుటం, శ్రీలంక సంభాషణలు, గతం నుండి విముక్తి, ముందున్న జీవితం, ధ్యానం, విద్య, అందు జీవితమునకుగల ప్రాధాన్యత, మన జీవితాలు- జిడ్డు కృష్ణమూర్తి వ్యాఖ్యానాలు, స్వీయజ్ఞానం, స్వేచ్ఛ, నీవే ప్రపంచం- జె.కృష్ణమూర్తి, గరుడయానం,



ఆటో నడపడంలో శిక్షణ పొందిన మహిళను అభినందిస్తున్న అనురాధ తదితరులు

# మహిళల స్వావలంబనకు కృషి

**ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పంచుమర్తి అనురాధ**

**గుంటూరు :** ప్రతి మహిళ ఆర్థిక స్వాలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ మహిళ సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ పంచుమర్తి అనురాధ అన్నారు. సంస్థ డైరెక్టర్లు బి.లక్ష్మీ, జి.మేఘలాదేవి, సి.హెచ్.విశాలాక్షి, యం.నిర్మల, వై.వి.రాజేశ్వరితో కలసి దుర్గాబాయి మహిళా వికాస కేంద్రాన్ని సందర్శించి మహిళలకు ఆటో శిక్షణ, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అనురాధ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి మహిళ స్వశక్తితో జీవించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు 1987లో ప్రతి జిల్లాలో మహిళా ప్రాంగణాలను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుండి ఈ మహిళా ప్రాంగణాల్లో మహిళలకు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేవారన్నారు. కాలక్రమేణా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా తదితర సంస్థల ద్వారా కూడా మహిళలకు శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లాలో ఉన్న మహిళా ప్రాంగణాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, మహిళలకు సంబంధించిన అన్ని శిక్షణా కార్యక్రమాలు మహిళా ప్రాంగణంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని, దానికనుగుణంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. టైలరింగ్, కంప్యూటర్, ప్రింటింగ్, బైడింగ్‌లలోనే కాకుండా స్కిల్ డెవలప్‌మెంట్, స్పోకెన్ ఇంగ్లీషు తదితర శిక్షణా కార్యక్రమాలతో పాటు, ప్రతి జిల్లాలో ఉన్న పరిశ్రమలు, పరిస్థితులకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ప్రతి జిల్లాలోని మహిళా ప్రాంగణాలను పరిశీలించి ప్రాంగణాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు నిర్మించుకునేందుకు మహిళలు ముందుకు వస్తే ఈ సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని టైలరింగ్, కంప్యూటర్ తదితర కోర్సులలో శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణలత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డెరెక్టర్ ఎం.జె. నిర్మల, ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.స్వరూపరాణి, ప్రాంగణం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల విదేశీయానాలకు చెక్

**- ఆర్థిక శాఖ ఆంక్షలు**

**రాజధాని ప్రతినిధి, రాజధాని :** తరచూ విదేశాలలో వాలిపోతున్న అధికారులు జాబితా ఇటీవల పెరిగిపోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వంద మందికి పైగా ఉన్నత స్థాయి అధికారులు గత మూడేళ్లలో అమెరికా, బ్రెజిల్, మలేషియా వంటి దేశాలను సందర్శించడం గమనార్హం. సిబ్బంది వ్యవహారాల శాఖ ఈ అధికారులు, వారు సందర్శించిన దేశాల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. దాని ప్రకారం మొత్తం 106 మంది అధికారులు 2013-15 మధ్య కాలంలో విదేశీ పర్యటనలు చేశారు. వారిలో సెక్రటరీ, అండర్ సెక్రటరీ స్థాయి అధికారులు కూడా ఉన్నారు. గతేడాది 44 మంది అధికారులు ఎనిమిది దేశాలను సందర్శించగా, అంతకుముందు రెండేళ్లలో 24 మంది అధికారులు మూడు దేశాలను, 38 మంది ఐదు దేశాలను సందర్శించారు. అమెరికా, సింగపూర్, బెల్జియం, ఇంగ్లాండ్, కొరియా, కెనడా, బ్రెజిల్ దేశాలలో వీరు పర్యటించారు. ఇలా విదేశాలను సందర్శించిన ఒక బృందంలో 22 మంది అధికారులుండటం గమనార్హం. ఒకే అధికారి ఒకటి కంటే ఎక్కువ దేశాలు కూడా సందర్శించారు. అధికారులు ఏడాదికి నాలుగుసార్లకు మించి విదేశీ పర్యటన చేయకూడదని, ఐదు పనిదినాలకు మించి ఉండకూడదని ఆర్థిక మంత్రిత్వశాఖ నెల క్రితం ఆంక్షలు విధించడంతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఐతే ఇదే చివరి జాబితా కాదని, ఈ అధికారుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. విదేశాలకు వెళ్లిన వారిలో ప్రధాని కార్యాలయం నుంచి 15 మంది అధికారులు ఉన్నారు. సెక్రెటరీల ఆమోదం కోసం స్క్రీనింగ్ కమిటీ ఉంచాలని కొత్త నిబంధనలలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సమావేశాలు, ఎగ్జిబిషన్లు, వర్క్ షాపులు, కాన్ఫరెన్స్‌లలో పాల్గొనడంపైనా ఆంక్షలు విధించారు. విదేశాలకు వెళ్లే బృందంలో విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి ఉండాల్సిన అవసరం లేదు దానికి బదులుగా ఆయా దేశాలలో ఉన్న మన రాయబార కార్యాలయం సేవలు ఉపయోగించుకుంటారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో అత్యవసరమైతే తప్ప కార్యదర్శి స్థాయి అధికారులు ఎలాంటి విదేశీ పర్యటనలు చేయకూడదని నిబంధన విధించారు.

# 35 కోట్ల మందికి ఈఎస్ఐ సేవలు

**- కేంద్రమంత్రి దత్తాత్రేయ**

**ప్రతినిధి రాజధాని :** రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 35 కోట్ల మందికి సామాజిక భద్రత అందించాలనే లక్ష్యంతో ఈఎస్ఐ సేవల విస్తరణకు ప్రణాళికలకు సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ వెల్లడించారు. రెండు రాష్ట్రాల్లో కార్మిక బీమా సంస్థ (ఈఎస్ఐసీ) పథకలపై కార్మికులకు అందుతున్న సేవల సమీక్షించారు. తెలంగాణలో సుమారు 10.6 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 8.5 లక్షల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఆరు పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈఎస్ఐ సేవల విస్తరణకు ప్రణాళికలు తయారు చేసినట్లు దత్తాత్రేయ తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని నిర్ణయం తిసుకున్నామన్నారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎస్. రామోహనరావు : 8801933160, మందడం.

**దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్**
& జిరాక్స్ తీయబడును
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

**ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్**
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

**వివాహ బంధం**
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

**REALESTATE**

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

నవ్యాధ్రరాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ రింగులో ల్యాండుపూలింగ్‌లో ఇచ్చిన జరీబు పొలం 40 సెంట్లు కలదు. సంప్రదించండి 9440662699
Google Co-ordinates
16.561657, 80.476594

**రేమండ్ టైలర్స్**
మెయిన్ బజారు, తుళ్ళూరు

**చంద్రిక ట్రేడర్స్**
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

**కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్**
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935


# మేక్ ఇన్ ఇండియాలో రెట్టింపు వ్యయం

**- అంతర్గత ఆడిట్ వెల్లడి**

**- తప్పపట్టిన కాగ్, మహేశ్వరన్ కమిటీ**

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోడీ ఆర్భాటంగా ప్రారంభించిన పథకం 'మేకిన్ ఇండియా' ఖజానాను నిలువు దోపిడీ చేస్తోంది. ఈ పథకం పేరు చెబితే కొమ్ములు తిరిగిన ప్రభుత్వ రంగ సంస్థలే బెదిరిపోతున్నాయి. మేకిన్ ఇండియా పేరిట జరుగుతున్న ఆర్భాటానికి, వాస్తవాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని భారీ వైమానిక ప్రాజెక్టుల సంబంధించి ప్రభుత్వ నిర్వహించిన అంతర్గత ఆడిట్లలో వెల్లడైంది. దిగుమతి చేసుకుంటే అయ్యే వ్యయం కన్నా మేకిన్ ఇండియా వ్యయం ఎన్నో రెట్లు అధికంగా ఉంటోందన్న నిజాన్ని ఈ ఆడిట్లు బయటపెట్టాయి. పథకం పైగా 90 శాతం విదేశీ పరికరాలు, సాంకేతికతతో రూపొందించిన ప్రాజెక్టులకు మేకిన్ ఇండియా పేరు ఎలా పెడుతున్నారని ప్రభుత్వ సంస్థల నివేదికలే నిలదీశాయి. రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), హిందుస్తాన్ ఏరోనాటికల్ (హెచ్‌ఏఎల్) సంస్థలు తమ విదేశీ భాగస్వాములతో కలిసి, లేదా సాంకేతికత బదిలీ విధానంలో 'భారత్‌లో సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టులు' చేపట్టిన సందర్భంగా ఈ ఆడిట్ నిర్వహించాయి. రక్షణ రంగంలో వేల కోట్ల ప్రాజెక్టులను మేకిన్ ఇండియా కింద దేశీయంగానే తయారు చేస్తున్నామని మోడీ సర్కారు ఊదరగొడుతుంది. అసలు కథ మాత్రమే వేరే ఉంది. రష్యా నుంచి సాంకేతికత బదిలీ విధానంలో.. 140 చేయాలని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌కు ప్రభుత్వం బాధ్యత అప్పగించింది. రష్యా నుంచి దిగుమతి చేసుకుంటే అయ్యే వ్యయం కన్నా తక్కువ ఖర్చుతో రూపొందించాలని షరతు కూడ విధించారు. ఈ 140 విమానాలపై హెచ్‌ఏ ఎల్‌తో ఐఏఎఫ్ నాలుగు భిన్నమైన ఒప్పందాలు చేసుకుంది. అనంతరం 40, 42 అదనపు విమానాల కోసం మరో రెండు కాంట్రాక్టులు చేసుకుంది. మొత్తం మీ 222 ఎస్-30 ఎకేఐలను హెచ్‌ఏఎల్ నిర్మించాల్సి ఉంటుంది. వీటిని నిర్మాణానికి మేకిన్ ఇండియా జోరులో హెచ్‌ఏఎల్ ఉత్సహంగా రంగంలోకి దిగింది. తీర దిగాక కథ వేరేగా ఉంది. దిగుమతి చేసుకునే వాటికన్నా తక్కువ వ్యయంతో విమానాలు నిర్మించాల్సి ఉంది. కాని నాల్గవ దశ వాస్తవ వ్యయం దిగుమతి చేసుకున్న యుద్ధ విమానాల కన్నా ఎంతో ఎక్కువ ఉంది' అని హెచ్‌ఏఎల్ తన నివేదికలో వాపోయింది. 2014-15లో ఫేజ్-1లో రష్యా నుంచి ప్రత్యక్షంగా దిగుమతి చేసుకున్న ఒక్కో విమానం ఖర్చు రూ. 270. 28 కోట్లు ఉండగా, మేకిన్ ఇండియా కింద హెచ్‌ఏఎల్‌కు అయిన వ్యయం రూ. 417.85 కోట్లుగా ఉంది. అంతేకాదు.. వీటి తయారీకి రష్యా కన్నా రెండు, మూడు రెట్లు ఎక్కువ పనిగంటలు ఖర్చవడం గమనార్హం. స్వదేశీ హెలికాప్టర్లా?! హెచ్‌ఏఎల్ రూపొందించిన ఆధునిక తేలికపాటి హెలికాప్టర్‌లది మరో కథ. ఈ ప్రాజెక్టులపై కాగ్‌నివేదిక తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. 'ఈ హెలీకాప్టర్‌ల తయారీలో 50 శాతం దేశీయ పరికారాలనే ఉపయోగించాలని నిర్దేశించారు. కాని ప్రతి హెలీకాప్టర్‌లో 90 శాతం విదేశీ సరఫరాదారులు మెటీరియల్‌నే ఉపయోగించారని కాగ్ తప్పుపట్టింది. ఐనప్పటికీ రెండు రెట్లు ఎక్కువ పనిగంటలు పట్టడమేమిటని ప్రశ్నించింది. మరో ఆసక్తికర విషయం ఏమంటే హెలికాప్టర్‌లలో ఉపయోగించిన శక్తి ఇంజిన్‌కు మేకిన్ ఇండియా పేరు పెట్టడాన్ని ఎయిర్ మార్షల్ మహేశ్వరన్ నివేదిక తప్పుపట్టింది. ఈ ఇంజన్‌పై ఎలాంటి కనీస సాంకేతిక నియంత్రణ కూడా లేకుండా ఇండియా పేరు ఎలా పెట్టుకుంటారని నిలదీసింది.

**ఇజ్రాయిల్ సాంకేతికతకు మన పేరు**

ప్రతిష్టాత్మకమైన ఆకాశ్, త్రిశూల్ క్షిపణుల వ్యవస్థలను రూపొందించడంలో ఆలస్యం కావడంతో 2005లో డీఆర్‌డీఓ సంస్థ ఇజ్రాయిల్ ఏరొస్పేస్ ఇండస్ట్రీస్(ఐఏఐ)తో కలిసి దీర్ఘశ్రేణి క్షిపణులు అభివృద్ధి చేయడం ప్రారంభించింది. అనంతరం 2007లో మధ్యశ్రేణి క్షిపణులను పని ప్రారంభించారు. అకస్మాత్తుగా ఈ మొత్తం ప్రాజెక్టులను తీవ్రంగా దెబ్బతీస్తూ ఈ రెండిటిని కలిసి ఒకే మిస్సైల్‌గా తెరపైకి తెచ్చారు. మహేశ్వరన్ నివేదిక దీనిని తీవ్రంగా తప్పుపట్టింది. ఈ ప్రాజెక్టుకు డిజైన్ అధారిటీగా ఉన్న ఇజ్రాయిల్ సంస్థ సరఫరాదారు కాగా డీఆర్‌డీఓ కొనుగోలు దారులు మాత్రమే. ఇప్పుడు డీఆర్‌డీఓ డిజైన్ ఎలా అవుతుందని నివేదిక నిలదీసింది. 'సాంకేతిక బదిలీ ఉండదని కాంట్రాక్ట్‌లో ఉండటంతో ఇప్పటికీ ఇజ్రాయిలీ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌పైనే ఆధారపడి ఉన్నాం.


వీటిపై మేథో సంపత్తి హక్కులు కూడా ఇజ్రయేల్‌కే ఉన్నాయిని' నివేదిక పేర్కొంది.



Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

## ఆరోగ్యం

డాక్టర్ దీపక్ వర్మ
బి.హెచ్.ఎమ్.ఎస్.



# కామెర్లు

ఈ జబ్బు మనందరికి తెలిసిన వ్యాధి అయిన ఏటా ఈ వ్యాధి లక్షణాలను సరిగా గుర్తించక ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. విపరీతమైన దుష్పరిణామాలకు లోనవుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు, కారణాలు మొదటి దశలోనే గుర్తించినట్లైతే ఎలాంటి ప్రమాదం లేకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

కామెర్లు అంటే చర్మం, కళ్ళు, పసుసు పచ్చగా మారడం. దీనికి కారణం కాలేయంలో సమస్యలు ముఖ్యంగా బిలిరూబిన్ అనే పదార్థం రక్తంలో ఎక్కువగా ఉండటం. ఈ “బిలిరూబిన్” అనే పదార్థం చనిపోయిన రక్తకణాల నుండి ఉత్పత్తి అవుతుంది. దీన్ని మన కాలేయం సంయోగ క్రియతో జీర్ణం చేసుకొని మూత్ర, మలాల ద్వారా బయటకు పంపుతుంది. కాలేయంలో ఎటువంటి సమస్యలు ఏర్పడిన ఈ క్రియలో లోపాల వల్ల కామెర్ల వ్యాధి సోకుతుంది.

**కారణాలు:** బిలిరూబిన్ శరీరంలో ఎక్కువగా ఉత్పత్తి అవ్వదు, సంయోగక క్రియలో సమస్యలు రావడం, కాలేయ కణాలు చనిపోవడం, రక్తహీనత, గ్లూకోజ్ అనే జీవక్రియ లోపాలు ఈ సమస్య పుట్టుకతోనే వస్తుంది. అంతే కాకుండా రక్త కణాలు చనిపోవడం, ఐరన్ విటమిన్స్‌లో లోపాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్, అధిక మద్యపానం, గర్భనిరోధక మాత్రలు, కాలేయంలో రాళ్ళు ఉత్పత్తి, అవ్వడం.

**పరీక్షలు:** లివర్ ఫంక్షన్ టెస్ట్, బిలిరూబిన్ డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్, టోటల్, బ్లడ్ ఎమినో, యు. యస్. ఎ అబ్‌దోమెన్, లివర్ బియోపిసీ.

**లక్షణాలు:** అతిగా వాంతులు రావడం, ఆకలి మందగించడం, అరుగుదలలో లోపాలు, కడుపు కుడి భాగంలో తరచూ నొప్పిరావడం, కాలేయం కడుపును పరీక్షించినప్పుడు చేతులకు మెత్తగా తగులుతుండడం, జ్వరం అధిక టెంపరేచర్ ఉండటం, తలనొప్పి రావడం, మానసిక ఆందోళన, తికమకలు ఎక్కువగా ఉండటం, కడుపు, కాళ్ళు, ముఖం నీరు పట్టి ఉబ్బడం నీరసం, అలసిపోవడం.

**హోమియో వైద్యం:** వ్యాధి కారణాలు త్వరగా గుర్తించి తగిన వైద్యం వెంటనే అందించడం వల్ల వ్యాధి దుష్పరిణామాలు దూరమవుతాయి. రోగులలో తరచూ ఈ వ్యాధి వచ్చే వారికి రోగ నిరోధక శక్తి నుండి, శారీరక, మానసిక తత్వాలను బట్టి మనం చికిత్స తీసుకొనడం వల్ల మళ్ళీ మళ్ళీ ఈ రోగం వచ్చే వారిలోను, అసలు ఎలాంటి వైద్యానికి చలించని రోగులలోను హోమియోపతి వలన శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# బాలిక జీవితాన్ని మార్చిన వ్యాసం

**కోల్‌కత :** పిల్లల జీవితాలను టీచర్లు చక్కదిద్దుతారన్న మాటను నిజం చేసే ఓ సంఘటన కోల్‌కతాలో వెలుగుచుసింది. కుటుంబంపై ఓ వ్యాసం రాయమని ఓ టీచరు పిల్లలకు సూచించారు. మరునాడు పిల్లలంతా వ్యాసం రాసుకొవచ్చారు. అయితే ఓ పదేళ్ల బాలిక రాసిన వ్యాసం మాత్రం టీచరు కంట నీరుపెట్టించింది. ‘మా నాన్న చెడ్డవాడు. రోజూ అమ్మను కొడుతుంటాడు. మమ్మల్ని ఎవరూ పట్టిచుకోరు. మా కుటుంబ సభ్యులంతా చూసిచూడనట్లు ఉంటారు. పెద్దయ్యాక ‘అమ్మను నాన్న నుంచి దూరంగా తీసుకెళ్లి బాగా చూసుకుంటాను’ అంటూ ఆ బాలిక వ్యాసం రాసుకెళ్లింది. ఇది చూసిన ఉపాధ్యాయురాలు విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రిన్సిపల్ కూడా వెంటనే స్పందించి పాఠశాల కౌన్సిలర్‌తో చర్చించారు. బాలిక తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. తన పద్ధతి మార్చుకోకపోతే భార్యాబిడ్డలకు దూరంగా ఉండాలని పాప తండ్రికి హితవు పలికారు. బాలిక తనపై పోగొట్టుకున్న నమ్మకాన్ని తిరిగి పొందాలంటే మారాల్సిందేనని అతనికి సూచించారు. ప్రిన్సిపల్ చర్యతో ఆ తండ్రిలో నెమ్మదిగా మార్పు వచ్చింది. పాపలో ఆత్మవిశ్వాసం పెరిగింది. చిన్నపిల్ల ఏదో రాసిందని వదిలేయకుండా సమస్యను పరిష్కరించటంతో టీచరు, ప్రిన్సిపల్ చొరవ చూపడం అభినందనీయం.



# ఇంగ్లీష్ పదాలపై ఫోకస్..

If you want to explore the world of words you need to understand the broad spectrum of vocabulary that comprises not just extensive study of words but word groups (phrases) phrasal verbs, idioms, proverbs and foreign phrases.

| Words | phrases | Phrasal verbs | idioms | proverbs | foreign phrases |
|---|---|---|---|---|---|
| Abase | up-beat | turn down | matinee idol | | fait accompli |
| Abet | backwaters | take after | tooth and nail | | fauxpas |
| Abash | backwoods | look down upon | cry wolf | | tête-à-tête |

Focusing only on the words ( first column) will make you baffled when somebody uses a phrase. For example look at the word up-beat, what does it mean? If you read English newspapers you come across ample phrases. So you need to learn phrases to come out of mess. We are not done yet. We have phrasal verbs. A phrase is a group of words. If one of the two words is a verb it is called phrasal verb. For example turn -down( reject) is a phrasal verb. Down is not a verb but turn is a verb. Similarly take after is also a phrasal verb. Here take is a verb. The daughter takes after the father. What do you think it means? It means the daughter resembles her father. The frequency of phrasal verbs is very high in articles, academic books, newspapers and magazines.

Take a look at idioms. Idioms add color to your language and make your expression brief and powerful.

Once upon a time Film actor Chiranjeevi was a matinee idol. What do you think the sentence means?

matinee idol is a film actor who is admired for his good looks.

Alluri sitaramaraju fought the Britishers tooth and nail. Here tooth and nail does not mean that the revolutionary attacked the Britishers with his teeth and nails. It means He fought the Britishers ferociously with all his strength.

The last in a series of unpleasant events that finally makes you feel that you cannot continue to accept a bad situation, instead of saying all this, use the idiom last straw. So idiom is simple, effective and drives home the point.

| | |
|---|---|
| Communal | violence |
| Political | Allegiance |
| Ritua | practice |
| Religious | tolerance |




1. మత ఘర్షణలు, రాజకీయపొత్తులు,కర్మకాండలు, మతసహనం,
2. ఖరీదైన రెస్టారెంట్ అందమైన రుచికరమైన ఆహారం, సంతృప్తికరమైన విందు.

| | |
|---|---|
| Expensive | restaurant |
| Elegant | furniture |
| Delicious | food |
| Sumptuous | dinner |




**Poolabala, ELT Expert and Resource person**
Director : Eazy Foreign Languages, Vijayawada: Ph- 9700877 409
French, German, Spanish, Italian and Japanese

# పరీక్షల్లో విజయానికి..



**పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా**

**తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు**

- విద్యార్థుల మానసిక పరిస్థితి తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. వారితో మృదువుగా మాట్లాడాలి. బాగా చదివి, పరీక్షలు బాగా రాసేలా వారిలో స్ఫూర్తిని నింపాలి.
- పిల్లలు ఇంట్లో ఉన్నపుడు వారితో గడిపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- వారికి శక్తివంతమైన, ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వాలి. లేనిపక్షంలో వారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- పిల్లలు రాత్రివేళల్లో చదివేంతవరకు తల్లిదండ్రులు మెలకువగా ఉంటే వారికి ధైర్యంగా ఉంటుంది.
- వారు ఏకాగ్రతతో చదువుకునేందుకు అనువైన వాతావరణం ఇంట్లో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలంటూ పదే పదే వారిపై ఒత్తిడి తీసుకురావద్దు. అలా చేస్తే వారి ఆత్మ స్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది.
- ఇంట్లో పార్టీలు ఏర్పాటు చేయడం లేదా వారిని పార్టీలకు తీసుకువెళ్లడం వంటివి చేయకూడదు.
- గత పరీక్షల్లో వారు చూపిన ప్రతిభ గురించి కించపరిచే విధంగా మాట్లాడటం లేదా అసహనం వ్యక్తం చేయవద్దు .
- అకారణంగా వారిని నిందించరాదు. తద్వారా వారు భయపడే ప్రమాదం ఉంది. అదువల్ల వారి మానసిక స్థితి దెబ్బతినవచ్చు.
- చదివే సమయం, వ్యాయామం, ఆహారం తదితరాలకు సంబంధించి తగిన సలహాలు ఇవ్వాలి.

**ఉపాధ్యాయులు తీసుకోవల్సిన జాగ్రత్తలు**

- పాఠ్యాంశాలను పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి.
- అసైన్‌మెంట్‌ను ఇవ్వడంతోపాటు దానిని పూర్తిచేసేందుకు తగిన వ్యవధి ఇవ్వాలి. అందువల్ల వారిపై ఒత్తిడి వుండదు.
- నోట్ పుస్తకాలలో తప్పులు సరిదిద్ది వీలైనంత త్వరగా తిరిగి ఇచ్చివేయాలి.
- విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ..వారిలో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపాలి.
- వారు వ్యక్తం చేసే సందేహాలు నివృత్తి చేయడంతోపాటు క్లిష్టమైన అంశాలపై చర్చకు వీలు కల్పించాలి.
- ఎలాంటి పరిస్థితుల్లోనూ వారిని అవమానించవద్దు. అందువల్ల వారు మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.
- వారిలో పని ఒత్తిడిని సృష్టించవద్దు. వెనుక బడిన విద్యార్థులను నిర్లక్ష్యం చేయకుండా, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

**విజయానికి సూచనలు..**


- పదో తరగతి సంబంధించి ఆంధ్ర ప్రదేశ్‌లో పాత విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో మాత్రం నిరంతరం సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానం అమలులో ఉంది. ప్రశ్నల స్థాయి విషయంలో రెండు రాష్ట్రాల్లో ఒకే విధంగా ఉంటుంది. భావనలపై అవగాభన, విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రశ్నలు ఉంటున్నాయి. వీటికనుగుణంగా సిద్ధమవ్వాలి.
- పరీక్షలను మన మేథస్సును, ఆలోచనా విధానాన్ని పరీక్షించేవిగా పరిగణించాలి. భవిష్యత్తును నిర్దేశించడానికి అవసరమైనవిగా భావించాలి.
- విద్యావిధానంలో పరీక్షలు, మూల్యాంకనాలు అత్యంత కీలకమైనవిగా అర్థం చేసుకోవాలి. అప్పుడే పరీక్షలంటే భయం పోయి ఇష్టం పెరుగుతుంది. పరీక్షలంటే సహజంగా భయం ఉంటుంది. అయితే దానిని అలవాటుగా మార్చుకోకూడదు.
- ప్రతి సబ్జెక్టులోనూ అన్ని అంశాలపై పట్టు ఏర్పడిందో.. లేదో నిర్ధారణ చేసుకోవాలి. వాటిని విశ్లేషణాత్మకంగా నేర్చుకోవాలి. వివిధ భావనల మధ్య సంబంధాలను గుర్తించి, అర్థం చేసుకోవాలి.
- అందుబాటులో ఉన్న సమాయనికి అనుగుణంగా చాప్టర్లవారీగా మోడల్ పేపర్లు, గ్రాండ్ టెస్ట్‌లు, గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- విశ్లేణాత్మకంగా చదవడం, తప్పులు లేకుండా భావయుక్తంగా రాయడం చాలా ముఖ్యం. పరీక్షల్లో అక్షరాల పరిమాణం, పదాల మధ్య దూరం సరిగా ఉండేలా చూసుకోవాలి.
- పరీక్షలకు సన్నద్ధం కావడానికి వాట్సప్ గ్రూపుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవడం, ఆన్‌లైన్ ట్యూషన్లు, ఈ – మెటీరియల్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం మంచిదే. అయితే వాటిని అతిగా వినియోగిస్తే విలువైన కాలాన్ని కోల్పోతారు.
- సైన్స్ విద్యార్థులు బొమ్మలను ప్రాక్టీస్ చేయడంపై దృష్టిపెట్టాలి. మ్యాథ్స్‌లో ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడానికి కీలకమైన సూత్రాలను సమగ్రంగా నేర్చుకోవాలి. ఆర్ట్స్ విద్యార్థులు మ్యాప్‌లు, ముఖ్యమైన తేదీలు, గణాంకాలపై దృష్టి పెట్టాలి.

**ఇప్పటినుంచి అంతా కీలక సమయమే..**

- ఇప్పటివరకు చదివిన తీరు ఎలా ఉన్నా.. ఇప్పటినుంచి ప్రిపేర్ అయ్యేది మాత్రం అత్యంత కీలకం. ఈ సమాయన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోగలిగితే విజయం సాధించడం తేలిక. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సహాయంతో సబ్జెక్టుల వారీగా కీలక అంశాలను ఇప్పటికే గుర్తించి ఉంటారు. అందువల్ల వాటిని ఒకటికి రెండు సార్లు చదవాలి. వాటి నుంచి ఎలాంటి ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముందో గుర్తించి, విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సమాధానాలు రాయటాన్ని ప్రాక్టీస్ చేయాలి. తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**టైమ్ మేనేజ్‌మెంట్**

- విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఏడు గంటల వరకు నిద్రపోవడానికి మినహాయించి మిగిలిన సమయాన్ని చదువుకే కుటాయించాలి. రోజూ పాటించే టైంటేబుల్ కాకుండా ఎప్పటికప్పుడు ఆయా అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక టైటేబుళు రూపొందించుకోవాలి.




Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# గ్రామ పురోభివృద్ధికి కృషి చేయండి

**రాజధాని వార్తలు – గుంటూరు :** రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం నియమించిన జన్మభూమి కమిటీలు గ్రామ పురోభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గత బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఉన్న అధికారులు, హైదరాబాద్‌లోని వివిధ శాఖల కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే కార్యక్రమాలు గ్రామ స్థాయిలో సక్రమంగా అమలవుతున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్విహిస్తున్నామని, ఇందులో గ్రామాలలోని జన్మభూమి కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనితీరును

**వీడియా కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**



కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. లోపాలున్నట్లు తెలిస్తే తక్షణమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో రహదారుల అభివృద్ధిని చేపట్టాలని చెప్పారు. పంట సంజీవని కార్యక్రమం కింద జిల్లాకు కేటాయించిన లక్ష పంట కుంటలను జూన్ మాసాంతానికి ఏర్పాటు చేయాలని, ఆ దిశగా తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు.

ఎన్.టి.ఆర్. జల సిరి కార్యక్రమం కింద భూగర్భ జలాల పెంపునకు విస్తృత చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ సక్రమంగా అమలు జరిగితే రెండంకెల వృద్ధిని సాధించగలమని ముఖ్య మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని 'బహిరంగ మల విసర్జన లేని గ్రామం'గా తీర్చాదిద్దేందుకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. వీటిపై ప్రజలలో సంపూర్ణ అవగాహన కలిగించవలసిన అవసరం ఉందన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర హోం మంత్రి చినరాజప్ప, రాష్ట్ర జల వనరుల శాఖమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పీతల సుజాత, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండె, సంయుక్త కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.నాగమణి, సంయుక్త కలెక్టర్.2 ఎం.వెంకటేశ్వరారావు, డి.ఆర్.ఓ. శ్రీ కె.నాగబాబుగారు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా టీడీపీ అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్



విలేఖరుల సమావేశంలో ఆచంట సునీత, మహిళా నాయకులు

**కృష్ణా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆచంట సునీత**

**రాజధాని – విజయవాడ :** టీడీపీ అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ మిగిలిన అన్ని యూనియన్లకంటే ఆదర్శప్రాయంగా ఉంటుందని కృష్ణా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, అంగన్ వాడీల సమన్వయకర్త ఆచంట సునీత అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అనుబంధ విభాగంగా తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ నూతనంగా ఏర్పాటు చేశారన్నారు. టిడిపి అంగన్ వాడీ ట్రేడ్ యూనియన్ కృష్ణాజిల్లా అధ్యక్షురాలిగా కొడాలి లతను నియమించామన్నారు. త్వరలోనే అన్ని మండలాల్లో కమిటీలను వేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనియన్ అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. అంగన్‌వాడీల జీతాల పెంపుతో పాటు వారి సంక్షేమంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు, వారికి పని భారం పెంచి ఒత్తిడి తీసుకురావద్దని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయటం జరిగింది, ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో అమలవుతున్న ఈ–పాస్ విధానం ద్వారా రాష్ట్రంలోని 55000 అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు, పామాయిల్ ఇవ్వడానికి ప్రభుత్వం కసరుత్తు చేస్తోందన్నారు. అంగన్‌వాడ కేంద్రాల పర్యవేక్షకులకు ట్యాబ్‌లు అందజేస్తుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ మహిళా సాధికారకతకు కృషి చేస్తున్న అంగన్‌వాడీ కార్మికుల సంక్షేమం కోసమే తెలుగుదేశం పార్టీ అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ జీతాల పెంపుతో తన చిత్తశుద్ధిని చాటుకుందని, రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికి జీతాల పెంపుతో 700 కోట్ల భారం పడుతున్నప్పటికీ అంగన్‌వాడీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు జీ.వో. విడుదల చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా 1,04,377 అంగన్‌వాడీలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఏప్రెల్ నుండి పెంచిన జీతాలు టీచర్‌కు రూ.7000 –, హెల్పర్‌కు రూ.4500 – ఇస్తారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కృష్ణవేణి, సి.హెచ్ వరలక్ష్మి ఎన్.లక్ష్మీ, కాత్యాయని, శ్రీదేవిలను, ఎన్. నాగమణి నియమించారన్నారు.

# నేర నియంత్రణకు అంతరిక్ష పరిజ్ఞానం

**న్యూఢిల్లీ :** నేరాల నియంత్రణకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు కోవాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించారు. దీనిని త్వరలో ప్రారంభించాలని భావిస్తున్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ భాగస్వామ్యంతో నేరాల నియంత్రణకు 'ప్రిడెక్టివ్ పోలీసింగ్ మెకానిజం' ను అభివృద్ధి చేస్తున్నారు. 'క్రైమ్ మ్యాపింగ్ , అనలిటిక్స్, ప్రిడిక్టివ్ సిస్టమ్‌ను ఢిల్లీ పోలీసులు ఇస్రో భాగస్వామ్యంతో ఉపయోగించనున్నట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఇందుకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు.

అంతర్గత భద్రత కోసం ఇస్రో సహకారం అందిస్తుంది. నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, సంబంధిత డేటా ఆధారంగా భద్రత నిర్వహణకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ఆయన చెప్పారు. సెంట్రల్ ప్రాసెసర్‌కు పర్సనల్ డిజిటల్ అసిస్టెంట్ డివైసెస్‌ను అనుసంధానం చేయడం ద్వారా ఈ వ్యవస్థను పరిపూర్తి చేస్తున్నారు. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసు అధికారులకు అందజే స్తారు. సెంట్రల్ ప్రాసెసర్‌లో రెండు లక్షల నేరస్తుల రికార్డులు నమోదు చేసుకునే అవకాశం ఉంది. సీఎంపీఎస్ ద్వారా అప్పటికప్పుడు జరిగే నేరాల సమాచారం కూడా ముందుగానే తెలిసిపోతుంది. నేరం జరిగే సమయానికి పోలీసులు ఘటనాస్థలిలో వాలిపోవచ్చు. రిపోర్టులు ఫైల్ చేయడానికి పోలీసు అధికారులు ప్రత్యేకించి పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. నేరం జరిగిన స్థలం నుంచే సమాచార మంతా ఈ విధానం ద్వారా సంబంధిత అధికారులకు అందుజేయడానికి వీలవు తుంది. నేరాలకు ఎవరైనా ఫోన్ చేస్తే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా ఆ ప్రాంతం వెంటనే తెలుస్తుంది. డిజిటల్ మెసేజ్ అందుతుంది. అభివృద్ధి చెందుతున్న కొన్ని దేశాలలోని నగరాల్లో మాత్రమే ప్రిడెక్టివ్ పోలిసింగ్ మెకానిజాన్ని అమలు చేస్తున్నాయి.

# కౌన్సిల్ అత్యవసర సమావేశం..

**పిఠాపురం టౌన్, రాజధాని ప్రతినిధి :** పిఠాపురం పట్టణంలో శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాలలో చైర్మన్ కరణం చిన్నారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కొంత మంది కౌన్సిలర్లు గైర్హాజరు అయ్యారు. సమావేశంలో ఒక అజెండా పొందు పర చగా గడిచిన డిసెంబర్‌లో కౌన్సిల్ ఆమోదం తెలిపిన పనుల ఆమోదం ఇచ్చి అగ్రిమెంటు దాఖలు చేయమని తెలిపినా కాంట్రాక్టరు సోదరుడు కుమారుడు మరణించడంతో పనులు మొదలు పెట్టలేకపోయామని దరఖాస్తుదారుడు తెలిపాడు. అందువలన ఈ టెండర్ల నుంచి తనను మినహాయించాలని విన్నవించగా కౌన్సిల్ ఆమోదించింది. ఈ అంశాన్ని మార్చి మొదటి వారంలో వచ్చే విధంగా చర్యలు చేపడతామని కమిషనర్ రామ్మోహన్ తెలిపారు. సమావేశము క్షణాల్లో తూతూ మంత్రంగా ముగించారు. టెండర్లు సమయ పాలనతో పూర్తి చేసే కాంట్రాక్టర్లకే ఇవ్వాలి తప్ప ఇలా వదిలేసే కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

# నరసరావుపేట సర్వతోముఖాభివృద్ధికి కృషి

**రాజాధాని వార్తలు – గుంటూరు :** జిల్లాలో వెనకబడిన ప్రాంతమైన నరసారావుపేట సర్వముతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని నరసారావుపేట పార్లమెంటు సభ్యులు రాయపాటి సాంబశివరావు హామీ ఇచ్చారు. తాను దత్తత తీసుకున్న దుర్గి మండలం ధర్మవరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు 'గెయిల్' (గ్యాస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) కంపెనీ ప్రకటించిన 2 కోట్ల రూపాయలను చెక్కును బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ శ్రీ కాంతిలాల్ దండేకు గెయిల్ కంపెనీ (హైదరాబాద్ జోనల్ ఆఫీసు) మానవ వనరుల విభాగాధిపతి వడ్డాడ కృష్ణమోహనరావు అందజేశారు.

గెయిల్ కంపెనీ ముందు గా రూ.9 కోట్లు అందించేం దుకు అంగీకరిం చిందని, అందులో భాగంగా తొలి విడతగా రూ.2 కోట్లు అందజేసిందని రాయపాటి తెలిపారు. వీటితో పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రూ. 77 లక్షలతో అంతర్గత సి.సి. రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపడతారన్నారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా రూ.93 లక్షలతో తాగునీటి సరఫరాకు కావలసిన పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు కల్పిస్తామని చెప్పారు. మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.30 లక్షలతో 120 ఎకరాల చెరువులో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపల తొలగింపు, చెరువు పూడిక తీసి కట్టలు అభివృద్ధి చేస్తారన్నారు. పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుండి నాలుగు గ్రామాలను ఎంపిక చేసుకొని వాటి అభివృద్ధికి కృషి చేస్తారన్నారు.


రూ.1,120 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఇందుకు అవసరమైన మంజూరుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు రాయపాటి వెల్లడించారు. మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల మునిసిపాలిటీలలో తాగునీటి సమస్య తీవ్రంగా వుందని, వాటి పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గెయిల్ ప్రతినిధి కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ, నరసరావుపేట పార్లమెంటు సభ్యుల చొరవతో గెయిల్ కంపెనీ ధర్మవరం గ్రామభివృద్ధికి భాగస్వామ్యం కావాలని నిర్ణయించి తొలి దశలో రూ 2. కోట్లు అందజేశామన్నారు. ముఖ్యంగా మునిసిపాలిటీ లలో కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణానికి గెయిల్ కంపెనీ కృషి చేస్తుందని, పాఠశాలల్లో కూడా అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటుకు కూడా ముందుకు వస్తుందన్నారు. కలెక్టర్ కాంతి లాల్ నరసారావుపేట దుర్గి మండలం ధర్మవ రం గ్రామ అభివృద్ధికి ముందుకు వచ్చిన గెయి ల్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరపున జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు డా.రాయపాటి శ్రీనివాస్, పంచాయతీ రాజ్, ఆర్.డబ్ల్యు,ఎస్., మైనర్ ఇరిగేషన్ ఎస్.ఇలు. జయరాజ్, గోపాలకృష్ణగారు, చౌదరి, గెయిల్ కంపెనీ ప్రతినిధులు రాం స్వరూప్ చిన్ని, జి.సీతారాం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సన్‌సద్ ఆదర్శ గ్రామ యోజన (యస్.ఎ.జి.వై.) పథకం**

నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు ధర్మవరం గ్రామం దత్తత తీసుకున్న గ్రామం దుర్గి మండలం గ్రామ జనాభా 3200, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీస్ స్కీము గ్యాస్‌ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్. (సి.యస్.ఆర్) ద్వారా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపటుతున్న సంస్థ గెయిల్ మంజూరు చేసిన మొత్తం రూ.2 కోట్లు వాటిలో రోడ్ల నిర్మాణం పంచాయతీ రాజ్‌కు రూ.77 లక్షలు, తాగునీటి సరఫరా పైపులైన్లు ఒవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, ఇంటి ఇంటికి కుళాయి కనెక్షన్స్ ఆర్.డబ్ల్యు.యస్. రూ.93 లక్షలు, 120 ఎకరాల చెరువులో పిచ్చి మొక్కలు, ముళ్ళ కంపలు, తొలగింపు, చెరువు పూడిక తీసి కట్టలు అభివృద్ధి పరచడానికి మైనర్ ఇరిగేషన్ రూ.30.లక్షలు. మొత్తం రూ.2.కోట్లు. పంచాయతీరాజ్ విభాగానికి కేటాయించిన రూ.77 లక్షలకు అదనంగా, జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే చొరవతో మహాత గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మరో, రూ.77 లక్షలు వెరసి.రూ 154 లక్షలతో గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణం జరగనుంది.

**రాయపాటి సాంబశివరావు**





# ఆమె

## రాజకీయ ఫైర్‌బ్రాండ్ నన్నపనేని



బహుముఖ ప్రజ్ఞాశాలియైన నన్నపనేని రాజకుమారి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నారు. ఆమె నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిమహిళా కమిషన్ ఛైర్మన్‌గా ఫిబ్రవరి 10న పదవీబాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆమె గురించి....

గుంటూరు జిల్లా సరిపూడిలో అక్టోబర్ 9, 1948లో పుట్టిన నన్నపనేని రాజకుమారి ఎన్‌టీ రామారావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. 1983–85లలో సత్తెనపల్లి నుంచి మరోసారి 1989–94లో వినుకొండ నుంచి ఆమె రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాదేళ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ఉండగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత ఆమె కాంగ్రెస్‌లో కొంతకాలం ఉన్నారు. ఎన్.జనార్ధనరెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డిల ప్రభుత్వంలో ఆమె తొలి మహిళా చీఫ్‌విప్‌గా పనిచేశారు. సమైఖ్య ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆతరువాత ఆమెకొన్ని అనివార్య పరిస్థితుల్లో మళ్లీ మాతృసంస్థ తెలుగుదేశంలో చేరి, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు. రాష్ట్ర విభజనకు విరుద్ధంగా ఆమె తన పోరాటాన్ని ఢిల్లీలో కూడా నిర్వహించారు. దానికి అనుబంధంగా ఆమె ఆమరణ నిరాహార దీక్షకు కూడా పిలుపు నిచ్చారు. అయితే ఆ కార్యక్రమం మొదలు పెట్టకముందే అకస్మాత్తుగా యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని రూపొందించింది. రాజకుమారి మంచి రచయిత కూడా, ఆమె రచించిన నన్నపనేని నవరత్నాలు 9 నవలల సమాహారం. ఆమెకు పాడటం, పెయింటింగ్ మంచి వ్యాపకాలు. కొన్ని సినిమాల్లో కూడా నటించిన ఆమె అనేక అత్యవసర సందర్భాల్లో రేడియోలోనూ. టీవీల్లోనూ తమ పార్టీ వాదనలను వినిపించారు. మహిళా కమిషన్ చైర్మన్‌గా కూడా ఆమె తన పదవికి వన్నె తేవాలని ఆశిస్తూ రాజధాని వార్తలు గుడ్‌లక్ చెబుతోంది.

# దక్షిణమధ్య రైల్వేలో భారీగా మహిళా కానిస్టేబుల్ పోస్టులు

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో 2030 స్పెషల్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్యరైల్వే ప్రధాన కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలి. నక్సల్ ప్రభావిత ప్రాంతాలకు చెందిన వారు మాత్రం ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు పంపవచ్చు. పరీక్ష ఫీజు చెల్లించనవసరం లేదు. రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

**పోస్టుల వివరాలు**

- ఆర్‌పీఎఫ్: మొత్తం ఖాళీలు 1827 (ఎస్సీలకు 264,ఎస్టీలకు145, ఓబీసిలకు 164, అన్ రిజర్వ్‌డ్ 804)
- ఆర్‌పీఎస్‌ఎఫ్ : మొత్తం ఖాళీలు 203 (ఎస్సీలకు 23, ఎస్టీలకు 33, ఓబీసీలకు 52, అన్ రిజర్వ్‌డ్ 95)
- అర్హత : పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- వయో పరిమితి : 2016 జూలై ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు తగ్గకుండా ఉండాలి. 25 సంవత్సరాలకు మించి ఉండకూడదు. 1991 జూలై రెండో తేదీ, 1998 జూలై ఒకటో తేదీ మధ్య జన్మించినవారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎత్తు : ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 152 సెంటీమీటర్లు, ఓబీసీ, ఆన్ రిజర్వుడు విభాగాలకు చెందినవారు 157 సెంటీమీటర్లు ఎత్తు ఉండాలి.
- ఎంపిక విధానం : రాత, పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ, ఫిజికల్ మెజర్‌మెంట్ పరీక్షలు, మెడికల్ టెస్ట్ డాక్యుమెంట్ వెరిఫికేషన్‌ల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు.

**రాత పరీక్ష:** రాత పరీక్షలో 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఓఎంఆర్ షీటుపై జవాబులు గుర్తించాలి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పు సమాధానం గుర్తించిన ప్రశ్నకు మార్కులో మూడో వంతున తగ్గిస్తారు. ప్రశ్నలకు పదో తరగతి స్థాయిలోనే అడుగుతారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, అర్థమెటిక్ నుంచి 35, జనరల్ ఇంటిలిజెన్, రీజనింగ్ విభాగాల నుంచి 35 ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు తెలుగు మాధ్యమం (మీడియం) లో ప్రశ్నాపత్రాన్ని ఎంచుకోవచ్చు. ఫిజికల్ టెస్టుకు ఎంపిక కావాలంటే రాత పరీక్షలో తప్పనిసరిగా అర్హత సాధించాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 30 శాతం మార్కు రావాలి. రాత , పరీక్ష, ఫిజికల్ టెస్టుల్లో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన తుది నియామకాలు చేపడతారు.



**ఫిజికల్ టెస్ట్**

రాత పరీక్షలో అర్హత మార్కులు పొందినవారికి ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ప్రటించిన పోస్టులకు 10 రెట్ల సంఖ్యలో అభ్యర్థులకు మాత్రమే ఫిజికల్ టెస్ట్‌ల్లో అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా మొదట పరుగు పందెం నిర్వహిస్తారు. అభ్యర్థులు 800 మీటర్ల దూరాన్ని తొలి ప్రయత్నం లోనే మూడు నిమిషాల 40 సెకన్లలో పూర్తిచేయాలి. దీనిని పూర్తిచేసిన వారు లాంగ్ జంప్‌ను 12 అడుగుల దూరం తగ్గకుండా చేయా. రెండు ప్రయత్నాల్లో లక్ష్యాన్ని సాధించాలి. అనంతరం హైజంప్‌లో మూడు అడుగుల ఎత్తు ఎగరాలి. దీనిని సాధించేందుకు రెండు ప్రయత్నాలు అనుమతిస్తారు. ఆపై అభ్యర్థులు ఎత్తు కొలుస్తారు. వీటన్నింటిలో అర్హత సాధించినవారు. ధ్రువ పత్రాలను పరిశీలిస్తారు. వీటి పరిశీలనకు ఆయా కేటగిరీల్లో ఉన్న ఖాళీలకు ఒకటిన్నరరెట్ల సంఖ్యలోనే అబ్యర్థులను పిలుస్తారు. ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ ఉంటే ఒకటి, ఎన్‌సీసీ లేదా ఆ పైస్థాయి సర్టిఫికెట్ ఉంటే బోనస్ మార్కులు కేటాయిస్తారు. గేమ్స్ స్పోర్ట్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ఒకటి నుంచి మూడు వరకు బోనస్ మార్కులు కేటాయిస్తారు. అర్హులైనవారికి అన్ని దశల్లోనూ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అందులోనూ ఎంపికైతే ఉద్యోగం ఖాయమవుతుంది. అనంతరం వీరికి శిక్షణ నిర్వహిస్తారు. శిక్షణ ముగిసినప్పుడు నిర్వహించే పరీక్షలో తప్పనిసరిగా ఉతీర్ణత సాధించాలి.

- **దతఖాస్తులకు గడువు :** ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు గడువు తేదీ 2016 మార్చి 1.
- **పరీక్ష తేదీ :** తరువాత ప్రకటిస్తారు.
- అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఎదో ఒక విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు పంపితే అనర్హులుగా పరిగణిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రింటవుట్ పోస్టు చేయాల్సిన అవసరం లేదు.

Edited with the trial version of
Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# ఇళ్ల తొలగింపు తప్పదా?

- రాజధానికి రహదారులే ప్రధానం,
- ఎంత పరిహారమైనా చెల్లిద్దాం : సీఎం
- ప్రతిపాదనల్లో మార్పునకు 'నో'

**రాజధాని- విజయవాడ :** 'రాజధానిలో పెట్టుబడులు రావాలంటే రహదారులు వంకర టింకరగా లేకుండా తిన్నగా ఉండాలి.. అభివృద్ధి అన్నాక ఎంతో కొంత నష్టం ఉంటుంది.. రహదారుల నిర్మాణంలో ఇళ్ళు కోల్పోయేవారికి మెరుగైన ప్యాకేజిలో పరిహారం ఎంతైనా సరే చెల్లిందాం. ఏదో విధంగా గ్రామస్తులను ఒప్పించడం.. అప్పటికీ అంగీకరించకుంటే నేనే స్వయంగా మాట్లాడుతా..'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, అధికారులతో అన్నట్లు సమాచారం. దీనిని బట్టి ఆయన రాజధానిలో ఎక్స్‌ప్రెస్ హైవే సహా అంతర్గత రహదారుల నిర్మాణంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్న సంకేతాలు ఇచ్చినట్లయింది. ఆరునూరైనా సరే ఎట్టి పరిస్థితుల్లో రహదారులు నిర్మించాలనే పట్టుదలతో ఉన్నారనిపిస్తోంది. అయితే రాజధాని నిర్మాణానికి భూసమీకరణలో భూములను ఇచ్చినవారితోపాటు ఇవ్వని రైతులు మాత్రం గ్రామాలను ధ్వంసం చేస్తూ రహదారులను నిర్మిస్తామంటే చూస్తూ ఊరుకోమని, ప్రాణాలకు తెగించైనా సరే గ్రామాలను కాపాడుకుంటామని మొండికేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణతో పాటు టీడీపీ శ్రేణులు, అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించిన సమయాల్లో స్పష్టం చేశారు. ఇప్పటికే పంట భూములను ఇచ్చేసిన తమకు గూడు కూడా లేకుండా చేయాలని చూస్తోందంటూ ప్రభుత్వం తీరుపై కారాలు, మిరియాలు నూరుతున్నారు. పాలకులు మాత్రం భూసమీకరణ ప్యాకేజి కంటే మెరుగైన ప్యాకేజీలు ఇస్తామని, రెట్టింపు పరిహారాన్ని చెల్లిస్తామంటున్నారు. నివాసానికి నివాసం, స్థలానికి స్థలం రహదారుల పక్కనే కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీలు ఇస్తున్నారు. అయినా గ్రామస్తులు మాత్రం వీరి ప్రతిపాదనలకు ససేమీరా అంటున్నారు.

***రంగంలోకి ముఖ్యమంత్రి!***

రాజధాని ప్రాంత గ్రామస్తులతో ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలోనే భేటీ కానున్నట్లు సమాచారం. ఇప్పటకే మంత్రులు, అధికారులు గ్రామాల్లో పర్యటించి రహదారుల విషయమై మాట్లాడారు. అయితే ఎక్కువ శాతం వ్యతిరేకిస్తుండడంతో ఆయా గ్రామస్తులతో చంద్రబాబు నేరుగా మాట్లాడనున్నారు. ఆ సమయంలో గ్రామస్తుల సందేహాలను తీర్చి, వారికి మెరుగైన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉంది. కృష్ణాయపాలెం పరిసరాల్లో భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడాలని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. గ్రామాలను ధ్వంసం చేస్తూ రహదారులను నిర్మిస్తే ప్రతిఘటిస్తామని ఇప్పటికే అనేకమంది గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాలైతే పంచాయతీల్లో తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించాయి కూడా. గ్రామాలకు నష్టం కలుగకుండా రహదారులను నిర్మించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరము లేదని రైతులు అంటున్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ హైవేతోపాటు అనేక రహదారులను తిన్నగా నిర్మించాలంటే కృష్ణాయపాలెం, మందడం, నిడమర్రు, నవులూరు, ఉండవల్లితోపాటు యర్రబాలెం, ఐనవోలు, తుళ్ళూరు, వెలగపూడి, రాయపూడి ఇలా అనేక గ్రామాల్లో కొన్ని ఇళ్ళు, ఇతర నిర్మాణాలు పూర్తిగా తొలగించవలసి ఉంటుంది. మరికొన్ని గ్రామాల్లో 30 నుండి 40 శాతం వరకూ ఇళ్ళను ధ్వంసం చేయాల్సిన పరిస్థితి. రాజధానిలో 200 అడుగుల వెడల్పుతో 18 కిమీ మేర ఎక్స్‌ప్రెస్ హైవే రానుంది. అలాగే 165 అడుగులు, 120 అడుగులు, 100 అడుగులు, 80 అడుగుల అంతర్గత రహదారులను నిర్మించాలని బృహత్ ప్రణాళికలో ప్రతిపాదించారు. ఇవన్నీ కూడా ప్రతిపాదనల మేరకు కార్యరూపం దాల్చాలంటే కచ్చితంగా కొన్ని గ్రామాలు కనుమరుగైపోవడం ఖాయంగా చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలోని గ్రామాలే కాకుండా ప్రతిపాదనలో లేని తాడేపల్లి గ్రామంలో కూడా కొన్ని నివాసాలు తొలగిస్తారనే ప్రచారం ఊపందుకోవడంతో ఈ గ్రామ ప్రజల్లో ఆందోళన మొదలైంది. అనేక తరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న మమ్ముల్ని రాజధాని రహదారుల నిర్మాణం పేరుతో రోడ్డున పడేయడం ఎంతవరకూ సబబని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

# 'నార్ల' వారి మాట..నేటికీ పూల బాట

## ఫిబ్రవరి 16 నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి

**రాజధాని- విజయవాడ :** పాత్రికేయుడిగా నార్ల వెంకటేశ్వరరావు (డిసెంబరు 1, 1908 – ఫిబ్రవరి 16, 1995) శైలి విభిన్నం. ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో రాసే మూసలో కొట్టుకుపోతున్న పాత్రికేయానికి ప్రజలు భాషను చేరువ చేశారు. ఆయన ప్రతి పదం..మాట నేటికీ ప్రజలకు పూల బాటే. వీ.ఆర్. నార్లగా కూడా వీరు ప్రసిద్ధులు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలకు చాలా కాలం నార్ల సంపాదకులుగా ఉన్నారు. పత్రికా రచనలే కాక వారు పలు నాటికలు, కవితలు మరియు కొన్ని కథలు రాసారు. అయన వివిధ దేశాల చరిత్రల రచన చేసినా, ఎందరో మహానుభావుల జీవితాలను చిత్రించడమే కాక జర్నలిజానికి ఎనలేని సేవ చేశారు. హేతువాదిగా, మానవతావాదిగా జీవించారు. వేల సంఖ్యలో వైవిధ్యభరితమైనా వ్యాసాలు రాసారు. నార్ల రచనలు అన్నీ కూర్చి ఇటీవలే "నార్ల రచనలు" పేరిట పలు భాగాలుగా నార్ల కుటుంబం వెలువరించింది.

ఆయన ఏప్రెల్ 3, 1958 నుండి ఏప్రెల్ 2, 1970 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ



సభ్యునిగా పనిచేశారు. ఆయన నార్లవారి మాట అనే శతకాన్ని కూడా రచించారు. నార్లవారి సొంత గ్రంథాలయంలో 20000 పుస్తకాలు ఉండేవట. కవిగా, రచయితగా, నాటకకర్తగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా, పాత్రికేయునిగా అనేకులకు నార్ల స్ఫూర్తి ప్రదాత. తెలుగు పత్రికా రచనకు కొత్త గౌరవాన్ని, మర్యాదను ఆయన సమకూర్చారు. 'స్వరాజ్య', 'జనవాణి', ప్రజామిత్ర' పత్రికల్లో మెరుపులు మెరిపించి 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రజ్యోతి' పత్రికల సంపాదక బాధ్యతలను చేపట్టి వాటిని తీర్చిదిద్దారు. ఎడిటర్‌గా పనిచేసిన ముప్పై మూడేళ్ళ కాలంలో చాంధస విశ్వాసాలపై రాజీలేని పోరు సాగించి, నిజం పట్ల నిబద్ధత, జనశ్రేయస్సుపై నిజాయతీ, వృత్తిపథంలో తిరుగులేని నిర్భీకతలను పాత్రికేయుడి ప్రధాన లక్షణాలుగా నార్ల విశ్వసించారు. సంపాదకీయాలను పత్రికకు ప్రాణదీపాలుగా మార్చడంతోపాటు, సామాజిక సంస్కరణకు వాహికలుగా వాటిని నార్లవారు ఉపయోగించారు. రాజగోపాలాచారిని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవాలని 1946లో మహాత్ముడు నిర్ణయించినప్పుడు– దానికి నిరసనగా నార్ల పరంపరగా సంపాదక శస్త్రాలను ప్రయోగించారు. మహాత్ముడు చనిపోయిన ప్పుడు ఆయన రాసిన సంపాదకీయం ఆంధ్రప్రదేశాన్ని పట్టి కుదిపింది. వేటూరి ప్రభాకరశాస్త్రి స్థాయి వ్యక్తి నార్లకు సాష్టాంగ నమస్కారం' అన్నారు. ప్రజలకు అర్థమయ్యే జీవభాషలో సంపాదకీయాలను రాశారు.

నైజాం ప్రభుత్వం ఆంధ్రప్రభను నిషేధించినా రజాకార్ల దురాగతాలపై ఎత్తిన కలం దించకుండా పోరాడిన యోధుడాయన. జైల్లో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య – జైల్లోకి విడుదలైన ఆంధ్రప్రభ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావుకు ఉత్తరం రాశారు. తన సంపాదకత్వంలో వస్తున్న పత్రికను ప్రభుత్వం కత్తిరింపులతో రాజకీయఖైదీలకు అందిస్తున్నందుకు నిరసనగా వెంకటేశ్వరరావుగారు ఒక రోజు పత్రిక మొదటిపేజీ నిండా నల్లగా ఇంకు పూసి విడుదల చేశారు. అది పత్రికా ప్రపంచంలో చాలా ఘాటైన నిరసన, దానితో ప్రభుత్వం సెన్సారు చేయడం మానుకుంది.

# చెన్నైలో బైక్ అంబులెన్స్‌లు !

**రాజధాని ప్రతినిధి, చెన్నై :** ప్రమాదాల్లో ఉన్న వారికి తక్షణ వైద్యం అందించడానికి వీలుగా తమిళనాడు ప్రభుత్వం 41 ద్విచక్ర వాహన అంబులెన్స్‌లను ప్రారంభించింది. వీటిని ముఖ్య మంత్రి జయలలిత జెండా ఊపి ప్రారంభించారు. చెన్నైలో రోడ్డు ప్రమాదాల్లో చిక్కు కున్న వారి వద్దకు నాలుగు చక్రాల అంబులెన్స్ వాహనం వెళ్లాలంటే ట్రాఫిక్ జామ్ వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు తగిన ఆక్సిజన్, రక్తస్రావం జరగకుండా ప్రాథమిక చికిత్స అందించడం చాలా అవసరం.

దీనికి వీలుగా తమిళనాడు ప్రభుత్వం ద్విచక్ర వాహన అంబులెన్స్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈవాహనాల్లో చిన్న ఆక్సిజన్ సిలిండర్, బీపీ పరిశీలించే యంత్రాలను సిద్ధంగా ఉంచుతారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినట్లు 108కు ఫోను వస్తే ఈ ద్విచక్రవాహనదారులు బాధితుల వద్దకు తక్షణం వచ్చి ప్రాథమిక చికిత్స అందిస్తారు.



# మెట్రో బిడ్డింగు పై జపాన్ ఆసక్తి

## – విజయవాడలో కేరిడార్ మార్గాలు పరిశీలించిన సభ్యులు


**రాజధాని ప్రతినిధి విజయవాడ :** అమరావతి మెట్రో రైలు ప్రాజెక్టు బిడ్డింగ్ పనుల్లో పాల్గొనేందుకు జపాన్ బృందం ఆసక్తి చూపుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్షేత్రస్థాయి అవగాహనకు సీజీ, తాకాజీ ఆధ్వర్యంలోని జపాన్ బృందం విజయవాడలో సోమవారం మెట్రోకేరిడార్‌ను పరిశీలించింది. దాదాపు 26.03 కిలోమీటర్ల పరిధిలో కారిడార్‌కు ప్రణాళిక రూపొం దించారు. పండిట్ నెహ్రూ బస్టాండు టెర్మినల్ –బందరురోడ్డు –పెనమలూరు ప్రాంతాల్లో నిర్మించతల పెట్టిన కారిడార్–1, పండిట్ నెహ్రూ బస్టాండ్ టెర్మినల్–ఏలూరు రోడ్డు–నిడమానూరు కారిడార్ ప్రాంతాల్ని ఈ బృందం తిలకించింది. అనంతరం మెట్రోరైలు ప్రజెంటేషన్‌ను విజయవాడ మున్సిపల్ కమిషనర్ జి.వీరపాండ్యన్ వివరించారు. మెట్రో రైలు రూపకల్పన ప్రతిపాదిత అంశాలపై జపాన్ బృందం సంతోషం వ్యక్తం చేసింది.

# పెరగనున్న రైలు ఛార్జీలు

- పదిశాతం పెంచేందుకు బడ్జెట్‌లో కసరత్తు
- ఇప్పటికే 14 శాతం పెంచిన మోడీ సర్కార్

**న్యూఢిల్లీ :** రానున్న రైల్వే బడ్జెట్‌లో చార్జీల మోత మోగనుంది. ప్రయాణీకుల చార్జీలను ఐదు నుంచి పది శాతం పెంచడానికి రైల్వే శాఖ రంగం సిద్ధం చేస్తోంది. సరకు రవాణా చార్జీల పెంపుపై మాత్రం తర్జన భర్జన పడుతోంది. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రైలు చార్జీలు 14 శాతం పెంచిన మోడీ ప్రభుత్వం మరోసారి బాదుడుకు సిద్ధమవుతుంది.

ప్రయాణీకులు, సరకు రవాణా విభాగాలలో ఆదాయం పడిపోవడం, ఏడవ వేతన సంఘం సిఫార్సులు కారణంగా పడే అదనపు భారాన్ని సర్దుబాటు చేసుకోవడాన్ని చార్జీలు పెంపునకు కారణాలుగా చూపేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. మరోవైపు ఆర్థికశాఖ 2015 –16 సంవత్సరంలో రైల్వేలకు కేటాయించే బడ్జెట్‌లో రూ. 8,000 కోట్ల కొతపెడు తుంది. రైల్వేలు తక్కువ ఖర్చు చేయడమే దీనికి కారణంగా తెలుస్తుంది. ఈ బడ్జెట్‌లో ప్రయాణీకుల చార్జీలు పెంచడంతోపాటు మరికొన్ని ఆదాయపెంపు మార్గాలను పరిశీలిస్తున్నారని రైల్వే శాఖ అధికారి ఒకరు తెలిపారు. చార్జీలు పెంచాలని నిర్ణయించినప్పటికీ



అది ఎవ్వుడు అనేదానిపైనే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆ అధికారి తెలిపారు. ఇది బడ్జెట్‌లోనే చేయాల్సిన అవసరం లేదని అయన అన్నారు. ఐతే మార్చి నుంచి రైళ్లలో రద్దీ పెరిగే దృష్ట్యా ఈ నెల 25న ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనే చార్జీలు పెంచితే బాగుంటుందనే అభిప్రాయం రైల్ భవన్‌లో వ్యక్తమవుతోంది. ఏ విభాగాలలో చార్జీలు పెంచాలనే విషయంపైనా చర్చ జరుగుతోంది. ఏసీ చార్జీలు ఇవ్వటికే ఎక్కువ ఉన్నాయి. వీటిని ఇంకా పెంచితే తక్కువ వ్యయంతో నడిపే విమాన చార్జీలను ఇవి మించిపోయే అవకాశ ముంది. వస్తురవాణా చార్జీలు కూడ ఎక్కువగానే ఉండగా మరోవైపు ఉక్కు, సిమెంట్, బొగ్గు, ఇనుము, ఎరువులు లోడింగ్ తగ్గిపోతోంది. దాంతో ఈ విభాగంలో చార్జీల పెంపు జరిగే అవకాశం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణీకుల చార్జీలు ఇప్పటికి 14 శాతం పెరిగాయి. గతేడాదే పదిశాతం పెంచారు. ప్రయాణ, రవాణా చార్జీలు కలిపి ఈ ఏడాది జనవరి వరకు మొత్తం రూ. 1,36, 079. 26 కోట్ల ఆదాయం లభించింది. ఇది లక్ష్యం కంటే 3.77 శాతం తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఆదాయం పెంపునకు వివిధ మార్గాలు అన్వేషిస్తున్నామని రైల్వే వర్గాలు తెలిపాయి. ఎంపిక చేసిన రూట్లలో చార్జీల పెంపు, వివిధ సుంకాల పెంపు అనే రెండు అంశాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని ఆ వర్గాలు వెల్లడించాయి.

వ్యయం తగ్గించుకోవడం, రైల్వే మిగులు భూములను వాణిజ్యపరంగా మరింత లాభదాయకంగా వినియోగించుకోవడం, వ్యాపార ప్రకటనల నుంచి పెద్దమొత్తం రాబడులు రాబట్టుకోవడం వంటి మార్గాల ద్వారా ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించడానికి రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. యాక్సిస్ కేపిటల్ అనే సంస్థ ద్వారా రైల్వేలు నిర్వహించిన అధ్యయనంలో .. ప్రయాణీకుల చార్జీలు పది శాతం, సరకు రవాణా చార్జీలు ఐదు శాతం పెంచాలని సిఫార్సు చేశారు.

# శంకుస్థాపన వాయిదా

**టెండర్లు అధికంగా కోట్ చేయడమే కారణం**

**రాజధాని ప్రతినిధి విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక సచివాలయ నిర్మాణానికి ఈ నెల 12వ తేదీ జరగాల్సిన శంకుస్థాపన కార్యక్రమం వాయిదా వేశారు. సుమారు రూ .180 కోట్లు అంచనా వ్యయంతో వెలగపూడి గ్రామ సమీపంలో నిర్మించనున్న ఏపీ తాత్కాలిక సచివాలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, ఎల్అండ్‌టీ, షాపూర్‌జీ పల్లోంజీ సంస్థలు మాత్రమే టెండర్లు దాఖలు చేశాయి. ఈ నెల 6వ తేదీ బిడ్లు తెరవగా, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే నిర్మాణ సంస్థలు దాదాపు 30 శాతం అధికంగా టెండర్లు కోట్ చేశాయి. దీంతో నిర్మాణం తాత్కాలికంగా వాయిదా పడింది.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**డివిజన్ కమిటీలకు మద్దాలి గిరి పిలుపు**

**రాజధాని- గుంటూరు :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం డివిజన్ కమిటీలు చురుగ్గా పని చేయాలని అధ్యక్షుడు మద్దాలి గిరి పిలుపునిచ్చారు. టి.డి.పి. గుంటూరు తూర్పు కార్యాలయంలో 8వ డివిజన్ తెలుగు దేశం కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సమావేశానికి 8వ డివిజన్ అధ్యక్షులు ఖుద్దూస్ అధ్యక్షత వహించారు. గిరి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దాలి గిరి, హిదాయత్, షౌకత్

మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలలో అన్ని డివిజన్‌లలో తెలుగు దేశం పార్టీ విజయం కోసం ఇప్పటి నుండే కృషి చేయాలని కోరారు. అందరికి ఇళ్ళు పథకం కింద అర్హులైన పేదలకు గృహాల మంజూరు కోసం తెలుగుదేశం నాయకులు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.డి. హిదాయత్ మాట్లాడుతూ సగరంలోని అన్ని డివిజన్లలో ఐక్యమత్యంగా పని చేయడం కోసం ఆత్మీయ సమావేశాలలో ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ప్రజలను కులాల పేరుతో రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ చూస్తోందని, వారి కుట్రలను ప్రజలకు వివరించి చెప్పాలని హిదాయత్ అన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ షౌకత్, డివిజన్ టి.డి.పి. నేతలు కొత్తూరి వెంకట్, పద్మ, సత్యం, ఖలీల్, దుర్గా, బుజ్జీ, నగర తెలుగుదేశం నేతలు మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పట్టాలెక్కిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్

- 17 బోగీలతో రాకపోకలు ప్రారంభం
- తునిలో రైలుకు సాదర స్వాగతం

**రాజధాని ప్రతినిధి తుని :** రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎనిమిది రోజుల అనంతరం పట్టాలెక్కింది. సోమవారం ఉదయం విజయవాడలో బయలుదేరి మధ్యాహ్నం 12.50 గంటలకు విశాఖ చేరుకుంది. తిరిగి 1. 15 గంటలకు విశాఖలో బయలుదేరి విజయవాడకు వెళ్లింది జనవరి 31న కాపు ఐక్యగర్జన సందర్భంగా ఆందోళనకారుల దాడిలో రైలు అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. దీంతో అప్పటి నుంచి ఈ రైలును నిలిపివేశారు. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు సికింద్రాబాద్ నుంచి బోగీలను రప్పించారు. గతంలో 24 బోగీలతో నడిచిన ఈ రైలు ప్రస్తుతం 17 బోగీలతో రాకపోకలు సాగిస్తోంది. వీటిలో 8 రిజర్వేషన్, 4 సాధారణ, 2 ఏసీ చైర్‌కార్, వంటశాల బోగీ, రెండు ఎస్ఎల్ఆర్ బోగీలు ఉన్నాయి. మరి కొద్ది రోజుల్లో మిగతా బోగీలను కూడా అందుబాటులోకి తెస్తామని రైల్వే అధికారులు వెల్లడించారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మరికొన్ని క్షణల్లో వస్తుందని విశాఖ స్టేషన్‌లో ప్రకటించడంతో అక్కడివారంతా ఒక రకమైన ఉద్వేగానికి లోనయ్యారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తునివాసులు రైల్వేస్టేషన్‌లో సాదర స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.35 గంటలకు తుని చేరింది. దీంతో స్థానికులు రైలు ఇంజన్‌కు పూలమాలలు వేసి, డ్రైవర్‌కు శుభాకాంక్షలు చెప్పారు. 'నాకు కులం, మతం తెలియదు.. మీ ఆగ్రహంతో నన్ను సమాధి చేస్తున్నారు', పమయానికి మీ గమ్యస్థానానికి చేరుస్తున్నా.. మీరు నాకిచ్చే గౌరవం ఇదేనా? ఇంటూ... రెండు ఫ్లెక్సీలను అగ్ని ఆహుతైన పాతరైలు బోగీలకు తునివాసులు కట్టారు.

# విజయవాడలో ఐఐపీఎం

## – ఇబ్రహీంపట్నం వద్ద భూమి గుర్తింపు

**రాజధాని ప్రతినిధి విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజిమెంట్ (ఐఐపీఎం) సంస్థ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకూ బెంగుళూరులో ఒకటి, ఈశాన్య రాష్ట్రాల్లో మరొకటి ఉన్నాయి. రాష్ట్రంలోనూ ఇలాంటి సంస్థ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు బెంగుళూరు సంస్థతో చర్యలు జరిపారు. వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఈ సంస్థను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమయింది. ఇందుకు సంబంధిచి కృష్ణా జిల్లా కలెక్టర్ అవసరమైన భూమిని కూడా గుర్తించారు. త్వరలోనే ఐఐపీఎం ఏర్పాటుకు భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు రానున్నాయి. బెంగళూర్ సంస్థ వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఈ ఇనిస్టిట్యూట్ నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం విజయవాడ నగరంలోనే అవసరమైన భవనాలను గుర్తించే పని జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే రంగాలను ప్రభుత్వం గుర్తించింది. అందులో ఉద్యావనాలను రాష్ట్రానికి ఉన్న గొప్ప వనరుగా భావించింది. ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పండ్ల దిగుబడిలోను, ఎగుమతుల్లోనూ రాష్ట్రా స్థానాన్ని మెరుగు పరచుకోవాలనుకుంటోంది. రెండంకెల వృద్ధి సాధనలో ఉద్యానరంగాన్ని ఒక ముఖ్యరంగంగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐఐపీఎం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. కాఫీ, టీ తోటలు, రబ్బర్, కోకో, కొబ్బరి వంటి తోటలకు సంబంధించిన పరిశోధనలపై ఐఐపీఎం దృష్టి సారిస్తుంది. దీంతో పాటు ఈ తోటల సాగులో అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణకు ఉపయోగపడుతుంది. రైతులకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో కొన్ని ఉద్యాన కోర్సులు నిర్వహిస్తారు. ప్లాంటేషన్‌కు సంబంధించిన కోర్సులు ఉంటాయి. బెంగుళూరులో సంస్థ అందిస్తున్న కోర్సులు కొన్నింటిని ఇక్కడ ప్రారంభించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుతం విజయవాడలో నెల కొల్పబోయే ఈ సంస్థకు ప్రభుత్వం ఆర్థికంగా కొంత మద్దతిచ్చినా 5 ఏళ్లలో స్వయం సమృద్ధి సాధించేలా చూడాలనే ఆలోచన.

# సైకిల్ వదిలి కారెక్కిన ఎర్రబెల్లి

- తెలంగాణలో టీడీపీకి భారీ షాక్
- టీడీపీ శాసనసభాపక్ష నేతను కండువా కప్పి ఆహ్వానించిన కేసీఆర్

**రాజధాని ప్రతినిధి హైదరాబాద్ :** అధికార టీఆర్ఎస్ పార్టీ ఆకర్ష్ దెబ్బకు తెలంగాణ టీడీపీ ఉక్కిరిబిక్కిరివుతోంది. బుధవారం ఏకంగా టీడీపీ శాసనసభాపక్ష నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆ పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సమక్షంలో టీఆఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అయనతో పాటు రాజేంద్రనగర్ టీడీపీ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కూడా టీఆర్ఎస్‌లో చేరారు. కుత్బుల్లాపూర్ టీడీపీ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మంగళవారమే సీఎం సమక్షంలోనే టీఆర్ఎస్‌లో చేరడం తెలిసిందే. ఆ మర్నాడే ఇలా ఏకంగా టీడీఎల్పీ



నేత మరో ఎమ్మెల్యేతో కలిసి టీఆర్ఎస్‌లో చేరి టీడీపీకి కోలుకోలేని షాకిచ్చారు. ఎర్రబెల్లి టీఆర్ఎస్‌లో చేరతారని చాన్నాళ్లుగా ప్రచారం జరుగుతున్నా ప్రతిసారీ ఆయన ఖండిస్తూ వచ్చారు. బుధవారం నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ ఉప ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న భారీ నీటిపారుదల మంత్రి టి. హరీశ్‌రావు, అది ముగియగానే నేరుగా హైదరాబాద్ ఆదర్శనగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎర్రబెల్లి నివాసానికి చేరుకున్నారు. గంటసేపు ఆయనతో చర్చలు జరిపిన హరీశ్, చివరకు ఎర్రబెల్లి కుటుంబ సభ్యలను కూడా ఒప్పించారని టీఆర్ఎస్ వర్గాలు చేబుతున్నాయి. కేసీఆర్ వారిద్దరితో గంటపేపు మాట్లాడారు. అనంతరం వారికి గులాబీ కాండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రబెల్లి ప్రకాశ్ గౌడ్‌లు తమ రాజీనామా లేఖలను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఫ్యాక్స్‌లో పంపారని సమాచారం.

Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# వెస్టిండీస్ బోర్డులో జీతాల గొడవ



వెస్టిండీస్ క్రికెట్ బోర్డులో మరోసారి సంక్షోభం తలెత్తింది. గడువు తేదీ నాటికి ఆటగాళ్లు కాంట్రాక్ట్‌లకు ఒప్పుకోకుంటే వారికి జట్టు నుంచి ఉద్వాసన పలుకుతామని విండీస్ బోర్డు (డబ్ల్యూఐసీబీ) హెచ్చరించింది. పదిహేను మంది సభ్యుల జట్టు కాంట్రాక్టులను తిరస్కరించిన నేపథ్యంలో డబ్ల్యూఐసీబీ ఇలా తీవ్రంగా స్పందించింది. "ప్రపంచకప్‌లో ఆడేందుకు డబ్ల్యూఐసీబీ కట్టుబడి ఉంది. ఇందులో మరో మాటకు తావులేదు. ఐతే కాంట్రాక్ట్‌పై సంతకం చేయకుండా ఏ ఆటగాడు కూడా విండీస్ దాటి వెళ్లలేదు. ఈ ఆటగాళ్లు కాంట్రాక్ట్‌లపై సంతకం చేయొద్దని నిర్ణయించుకుంటే వారి స్థానంలో ఇతర ఆటగాళ్లను ఎంపిక చేయడం తప్ప మాకు మరో మార్గం లేదు" అని డబ్ల్యూఐసీబీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి మైకెల్ ముర్‌హెడ్ స్పష్టం చేశాడు. తమకు ఇవ్వజూపిన మొత్తం సమ్మతం కాదని, కాంట్రాక్టులకు తాము ఒప్పుకోమని విండీస్ టీ20 జట్టు కెప్టెన్ డారెన్ సామి అంతకుముందు విండీస్ బోర్డుకు లేఖ రాశాడు. " తమకిచ్చే మొత్తం దాదాపు 80 శాతం తగ్గించారని అతడు పేర్కొన్నాడు. "కాంట్రాక్టులకు సంబంధించి గత మేలోనే మనం చర్చించుకున్నాం. ఒక అంగీకారానికి వచ్చాం. అప్పుడు ఆటగాళ్లెవరూ అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడు తీరా ప్రపంచకప్ ముందు ప్రశ్నలు లేవనెత్తుతుండడం నిరాశ కలిగిస్తోంది. మీ అంగీకారం కోసం ఎదురుచూస్తున్నాం. ఆదివారంలోగా అంగీకరించకపోతే మీరు సెలక్షన్‌కు తిరస్కరించినట్లు భావిస్తాం" అని సామికి ఇచ్చిన జవాబులో ముర్‌హెడ్ చెప్పాడు.

### ఆ సూచన అమలు చేస్తే

# బీసీసీఐకి రూ.1600 కోట్లు నష్టం



**ముంబై :** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రక్షాళనకు సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ లోధా కమిటీ ఇచ్చిన నివేదికపై బోర్డు పెద్దలు చర్చించబోతున్నారు. ఈ నెల 19న దీని కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే ఐసీసీ నుంచి ప్రస్తుతం వివిధ దేశాలకు అందుతున్న వాటాల గురించి కూడా ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సమావేశానికి హాజరయ్యే లోపే అన్ని సభ్య సంఘాలు లోధా కమిటీ ప్రతిపాదనలపై చర్చించాలని ఇప్పటికే బోర్డు సూచించింది. ఒకవేళ లోధా కమిటీ ప్రతిపాదనలకు అంగీకరిస్తే బీసీసీఐకి ఏడాదికి రూ.1600 కోట్ల వరకు నష్టం వస్తుందని అంచనా. ప్రస్తుతం టీవీ రైట్స్, ప్రకటనల ద్వారా ఏడాదికి సుమారు రెండు వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తోంది. లోధా ప్రతిపాదనల ప్రకారం ప్రకటనలు కేవలం లంచ్, డ్రింక్స్ విరామాల్లో మాత్రమే ప్రసారం చేయాలి. ఇలా చేస్తే సంవత్సరానికి రూ.400 కోట్లు కూడా రావని అంచనా. ప్రస్తుతం స్టార్‌స్పోర్ట్స్ సంస్థ ఒక్కో మ్యాచ్ ప్రసారం చేసినందుకు బోర్డుకు రూ.43 కోట్లు చెల్లిస్తోంది. లోధా నిబంధన అమల్లోకి వస్తే మ్యాచ్‌కు రూ.10 కోట్లు కూడా ఇచ్చే అవకాశం ఉండదు.

# మూడో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం



**సెంచూరియన్ :** ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. తొలి రెండు వన్డేల్లో ఓడిపోయిన సఫారీలు మూడో వన్డేలో 319 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి ఏడు వికెట్లతో ఘన విజయం సాధించారు. గత మంగళవారం రాత్రి జరిగిన ఈ వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 318 పరుగులు చేసింది. రూట్ (113 బంతుల్లో 125 పరుగులు 10 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ చేయగా... హేల్స్ (65), స్టోక్స్ (53) అర్ధసెంచరీలు సాధించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో అబాట్, రబడ రెండేసి వికెట్లు తీసుకున్నారు. దక్షిణాఫ్రికా జట్టు 46.2 ఓవర్లలోనే మూడు వికెట్లకు 319 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు డికాక్ (117 బంతుల్లో 135బీ 16 ఫోర్లు, 4 సిక్సర్లు), ఆమ్లా (130 బంతుల్లో 127 పరుగులు 13 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో చెలరేగారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 239 పరుగులు జోడించడం విశేషం. డు ప్లెసిస్ (29 బంతుల్లో 33 నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్సర్) రాణించాడు. డికాక్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

# ఓటమిపై సమీక్షించుకుంటాం : ధోని



**పుణే :** శ్రీలంకతో జరిగి తొలి టి20లో ఓటమిపై సమీక్షించుకుంటామని టీమిండియా కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తెలిపాడు. ఓటమి నుంచి సానుకూల పాఠాలు నేర్చుకుంటామని చెప్పాడు. తమ షాట్ సెలక్షన్ బాగోలేదనిన్నాడు. శ్రీలంకతో గత మంగళవారం జరిగిన మొదటి టి20లో భారత్ 5 వికెట్లతో ఓడిపోయింది. 'గత నెలలో తాము ఆడినవాటితో పోలిస్తే ఇక్కడి పిచ్ చాలా భిన్నంగా ఉంది. ఈ రోజు అందరికీ బ్యాటింగ్ చేసే అవకాశం దక్కింది. అదే సమయంలో బ్యాట్స్‌మన్ పై ఒత్తిడి కూడా ఉంటుంది. ఫలితం మేము ఆశించినట్టు రాలేదు. ఈ మ్యాచ్ ద్వారా సానుకూల అంశాలు నేర్చుకునే అవకాశం కలిగింది' అని ధోని వ్యాఖ్యానించాడు. 'టి20లో ఆలౌట్ కావడం అరుదుగా జరుగుతుంది. మన బ్యాటింగ్ సత్తా ఏమిటో తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరినీ పరీక్షించడంతో తప్పేమీ లేదు. రజిత, షనక, చమీర పేస్ త్రయం మా బ్యాటింగ్‌ను దెబ్బతీసింది. వన్డేలతో పోలిస్తే టి 20 మ్యాచ్‌లు భిన్నంగా ఉంటాయని ధోని వివరించాడు.

# టీ 20 కప్‌కు ఆసీస్ జట్టు ఇదే..

**సిడ్నీ :** త్వరలో భారత్‌లో జరుగనున్న వరల్డ్ టీ 20లో భాగంగా గత మంగళవారం ప్రకటించిన ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ పై వేటు పడింది. గత ఏడాది వరల్డ్ కప్ అనంతరం వికెట్ కీపర్‌గా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులోకి వచ్చిన మాథ్యూవేడ్ ు తొలగిస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) సెలక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. బ్రాడ్ హాడిన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని స్థానంలో వేడ్ జట్టులోకి వచ్చాడు. అయితే అటు కీపింగ్‌లోనూ, బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకోని వేడ్‌కు ఆసీస్ సెలక్టర్లు ఉద్వాసన పలికారు. అతని స్థానంలో కీపర్ పీటర్ నేవిల్‌ను 15 మంది సభ్యులతో కూడిన జట్టులో స్థానం కల్పించారు. ఆరోన్ ఫించ్‌ను టీ 20 కెప్టెన్సీ నుంచి తప్పించారు. అతని స్థానంలో వన్డే, టెస్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న స్టీవ్ స్మిత్‌నే టీ 20 సారథిగా నియమించారు.

## సిద్ధమౌతున్న కట్టడముల మార్కెటింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటి

**రాజధాని వార్తలు - గుంటూరు :** జాయాంట్ కలెక్టర్, గుంటూరు మరియు పర్సన్ -ఇన్-చార్జ్, వ్యవసాయ మార్కెట్ కమిటి, గుంటూరు వారు ఈనెల తేది.12వ తేదీన పాత మార్కెట్ యార్డు నందలి వ్యవసాయశాఖ కమిషనర్ మరియు మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయలకు సిద్ధమవుతున్న కటడాలను మార్కెటింగ్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వారితో కలసి పరిశీలించి కారట్రాక్టరుకు పనిలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.

# 'సాగ్'లో పతకాల పంట

**గువహతి :** దక్షిణాసియా క్రీడల్లో భారత క్రీడాకారులు తమ సత్తా చాటారు. సైక్లింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్, హాకీ అలా అన్ని విభాగాల్లో దుమ్ము రేపారు. మొత్తం 237 పతకాలను అందించిన వారు 139 స్వర్ణాలు, 78 రజతాలు, 20 కాంస్యాలు సాధించిపెట్టారు. పతకాల పట్టికలో ట్రిపుల్ సెంచరీ దిశగా భారత్‌ను వారు నడిపిస్తున్నారు. శ్రీలంక 139 పతకాలతో రెండో స్థానంలో 71 పతకాలతో పాకిస్థాన్ మూడో స్థానంలో ఉంది. టెన్నిస్‌లో హైదరాబాద్ బాలిక రిషిత సుంకరకు రజతం లభించింది. షూటింగ్‌లో టీం ఈవెంట్‌లో స్వర్ణం లభించింది. గగన్ నారంగ్ వ్యక్తిగతంగా రజత పతకానికే పరిమితమ య్యాడు. చెయిన్ సింగ్ స్వర్ణం సాధించాడు. ఫైర్‌పిస్టల్ విభాగంలో సమరేష్ సింగ్ పసిడిని కైవసం చేసుకు న్నాడు. వెయిల్ లిఫ్టర్ సాంబా లాపంగ్ స్వర్ణపతకం సాధించాడు. అతడికి అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం పది లక్షల రూపాయలను బహు మతిగా అందజేసింది. హాకీ, టెన్నిస్, సైక్లింగ్, రెజ్లింగ్, స్క్వాష్, లాంగ్‌జంప్, హై జంప్, షాట్‌పుట్, పరుగులో వివిధ విభాగాల్లో స్వర్ణాలు కొల్లగొట్టారు.




సైక్లింగ్‌లో స్వర్ణ, రజతాలు సాధించిన చోబాదేవి, విద్యాలక్ష్మి, బీబీ(పాక్)

స్విమ్మింగ్‌లో బట్టర్‌ఫ్లై విభాగంలో స్వర్ణపతకం సాధించిన భారత జట్టు

పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన విక్టర్ అభిలాష్‌తో రజత, కాంస్య గ్రహీతలు

పురుషుల రెజ్లింగ్‌లో స్వర్ణం సాధించిన ఖాత్రి

ట్రిపుల్ జంప్‌లో స్వర్ణ, రజతాలు సాధించిన రంజిత్, సురేందర్

స్విమ్మింగ్ పీస్టైల్ విభాగంలో స్వర్ణం సాధించిన భారత జట్టు

రైఫిల్ షూటింగ్‌లో స్వర్ణం సాధించిన మహిళల జట్టు

లాంగ్‌జంప్‌లో స్వర్ణ, రజత, కాంస్యాలు సాధించిన అంకిత్, ప్రేమ్ (భారత్), లియానా పతినరజ (శ్రీలంక)

స్వర్ణం సాధించిన మహిళల హాకీ జట్టు

పురుషుల షాట్‌పుట్‌లో స్వర్ణ, రజతాలు సాధించిన ఓంప్రకాష్, జస్‌దీప్ (ఇండియా) కాంస్య సాధించిన మహమ్మద్

రైఫిల్ షూటింగ్‌లో స్వర్ణ, రజతాలు సాధించిన చెయిన్ సింగ్,గగన్ నారంగ్ (భారత్), సిద్ధిక్ (పాక్)

1600 మీటర్ల పురుషుల రిలే పరుగులో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు

# భారత్ జట్టు సమతుల్యంగా ఉంది

### ఆస్ట్రేలియా క్రికెటర్ షేన్ వాట్సన్



**దుబాయ్ :** నైపుణ్యం ఉన్న ఆటగాళ్లతో టీమిండియా సమతుల్యంగా ఉందని ఆస్ట్రేలియా క్రికెటర్ షేన్ వాట్సన్ చెప్పాడు. స్వదేశంలో భారత క్రికెట్ జట్టు చాలా ప్రమాదకరమైనదని అభిప్రాయపడ్డాడు. భారత్‌ను వారి దేశంలో ఓడించడం అంత సులువు కాదని స్పష్టం చేశాడు. వచ్చే నెలలో ఆరంభం కానున్న వరల్డ్ టీ 20లో భారత జట్టే ఫేవరెట్‌గా వాట్సన్ అభివర్ణించాడు. 'నా ద అష్టిలో భారత్ అత్యంత క్లిష్టమైన జట్టు. ఆ జట్టుకు స్వదేశీ పరిస్థితులు కచ్చితంగా కలిసొస్తాయి. దాంతో టీమిండియానే వరల్డ్ కప్ ఫేవరెట్' అని వాట్సన్ తెలిపాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్)లో పాల్గొనేందుకు దుబాయ్‌కు వచ్చిన వాట్సన్ క్రికెట్.డాట్.కమ్. ఏయూతో ముచ్చటించాడు. ప్రత్యర్థి జట్లు ఆడేదాని కంటే కూడా స్వదేశంలో పరిస్థితులు టీమిండియాకు కలిసొస్తాయన డంలో ఎటువంటి సందేహం లేదన్నాడు. బ్యాటింగ్‌లో అత్యంత దూకుడుగా ఉండే భారత్.. బౌలింగ్ విభాగంలో కూడా మెరుగ్గానే ఉందన్నాడు. ప్రత్యేకంగా స్పిన్నర్ల విషయానికొస్తే మ్యాచ్‌ను క్షణాల్లో ప్రభావితం చేసే అత్యుత్తమ స్పిన్నర్లు వారి సొంతమన్నాడు. పేస్ విభాగంలో సీనియర్ ఆటగాడు ఆశిష్ నెహ్రా, యువ బౌలర్ బూమ్రాల రాకతో భారత జట్టులో చక్కటి సమన్వయం కనబడుతోందని ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికిన వాట్సన్ తెలిపాడు.

## మెషీన్ ఆపరేటర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రాజధాని- గుంటూరు :** యస్.సి. నిరుద్యోగ యువతలో వృత్తి నైపుణ్యాలను వెలికితీసి ప్లాస్టిక్ రంగ పరిశ్రమలలో ఉపాధి చూపించి, ఆర్థికంగా వారిని వారి కుటుంబాలను స్థిరపరచాలనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు మాసాల పాటు ప్లాస్టిక్ రంగంలో ఉచిత శిక్షణ అందించనుంది. " ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార ఆర్థిక సంస్థ, హైదరాబాద్" ద్వారా సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సి.ఐ.పీ.ఇ.టి) భాగస్వామ్యంతో విజయవాడలోని కానూరు అనుబంధ సంస్థ అయిన విజయవాడ ఆటో క్లస్టర్ డెవలప్మెంట్ కంపెనీ (వి.ఎ.సి.డి.సి.)లో ఈ శిక్షణను అందించనుంది. పదవ (10) తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యస్.సి. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. శిక్షణ పూర్తిచేసిన అనంతరం నూటికి 70 శాతం మంది అభ్యర్థులకు శిక్షణలో వారు చూపిన ప్రతిభ ఆధారంగా వివిధ రకాల ప్లాస్టిక్ పరిశ్రమలలో ఉపాధి కూడా కల్పిస్తారు. దరఖాస్తులు స్వీకరించుటకు మరియు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకొనేందుకు ఆఖరి తేది.15-02-2016 కాగా, అభ్యర్థులను ఎంపిక చేయి తేదీ 20-02-2016, శిక్షణా తరగతులు ప్రారంభించు తేదీ.21-02-2016.

**బిల్డర్స్‌కు ఆహ్వానం**

విజయవాడ నుంచి కంచికచర్ల వెళ్ళే మార్గంలో 36 ఎకరాల స్థలం జాయింట్ డవలప్‌మెంట్ లేదా అమ్మకానికి, అల్ట్రా మోడల్‌టౌన్‌షిప్ (ఇండివిడ్యువల్, విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ఫంక్షన్ హాల్స్) కట్టుకోవడానికి అనువుగా హైవే పక్కనే కలదు.

వివరాలకు నెం. 9676844442(రవి), 7680994755, 9440662699 సంప్రదించగలరు

### అండర్ 19 ప్రపంచకప్‌లో

# మన ప్రత్యర్థి వెస్టిండీస్

**ఢాకా :** అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ జట్టు వెస్టిండీస్‌తో తలపడుతుంది. సొంత గడ్డపై తొలిసారిగా ఈ టైటిల్‌ను సాధించాలనే ఆశతో ఉన్న బంగ్లాదేశ్‌కు వెస్టిండీస్ చేతిలో షాక్ ఎదురైంది. షామర్ స్ప్రింజర్ (2/36), (88 బంతుల్లో 62 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్) ఆల్‌రౌండ్ షో ప్రదర్శించడంతో గురువారం షేరె బంగ్లా జాతీయ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్లో ఆతిథ్య జట్టును విండీస్ 3 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో ఈ నెల 14న జరిగే ఫైనల్లో భారత్, వెస్టిండీస్ తల పడనున్నాయి. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 50 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్రారంభం నుంచే చెలరేగిన విండీస్ బౌలర్లు 88 పరుగులకే నాలుగు వికెట్లు పడగొట్టారు. ఈ దశలో మెహదీ హసన్ మిరాజ్ (74 బంతుల్లో 60 పరుగులు, 7 ఫోర్లు) క్రీజులో నిలబడి పోరాడాడు. సైఫుద్దీన్ (55 బంతుల్లో 36 పరుగులు, 3 ఫోర్లు)తో కలిసి ఆరో వికెట్‌కు 85 పరుగులు జోడించాడు. ఆ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో బంగ్లా స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. కీమో పాల్ మూడు, హోల్డర్ రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యం కోసం బరిలోకి దిగిన విండీస్ 48.4 ఓవర్లలో ఏడు వికెట్లకు 230 పరుగులు చేసి గెలిచింది. తక్కువ స్కోరే అయినా విండీస్ తమ ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. తొలి ఓవర్‌లోనే గిడ్రోన్ పోప్ (25 బంతుల్లో 38 పరుగులు 5 ఫోర్లు, 2 సిక్సర్లు) ఓ సిక్స్, రెండు ఫోర్లతో 14 పరుగులు రాబట్టాడు. ఈ దూకుడుతో జట్టు ఏడు ఓవర్లలో రెండు వికెట్లకు 56 పరుగులు సాధించింది. అనంతరం హెట్‌మైర్ (59 బంతుల్లో 60 పరుగులు 7 ఫోర్లు, 1 సిక్స్) జోరును కొనసాగించి వరుసగా రెండో అర్ధ సెంచరీ సాధించాడు. అయితే విండీస్ 147 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోవడంతో పాటు... 38వ ఓవర్‌లో రెండు వికెట్లు తీసి బంగ్లా బౌలర్లు కాస్త ఆందోళన కలిగించినా స్ప్రింజర్ తుదికంటా క్రీజులో నిలిచాడు. 49వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది జట్టును ఫైనల్‌కు చేర్చాడు. సలేహ్ అహ్మద్‌కు మూడు, సైఫుద్దీన్, మెహదీ హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.



Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit:
www.foxitsoftware.com/shopping

# సారే జహాసే అచ్ఛా 'నావికాదళ్' హమారా..




రాష్ట్రపతి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రక్షణ మంత్రి పారికర్, చిత్రంలో ప్రధాని మోడీ



భారత త్రివిధ దళాదిపతులు



నౌకల నుంచి ఇంధనాన్ని నింపుకొని యుద్ధ క్షేత్రానికి వెళుతున్న విమానాలు, జలాంతర్గామి



## సైనికులే ఆరాధ్యదైవాలు

భారతీయులకు తమ త్రివిధ దళాల సైనికులంటే ఎనలేని అభిమానం. వారిని ఆరాధ్య దైవాలుగా చూస్తారు. రేయింబవళ్లు సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి దేశాన్ని రక్షించే వారిసేవలను సదా గుర్తుంచుకుంటారు. ఫ్లీట్‌రివ్యూ 2016 సందర్భంగా నౌకాదళం సముద్రంలో సైనికులు చేసిన సాహస విన్యాసాలు సామాన్య ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి. వారి ప్రతిభాపాటవాలకు బ్రహ్మరథం పట్టారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్రజలు మరీ ముఖ్యంగా విశాఖవాసులు ఈ ప్రదర్శనను తమ పిల్లలకు కూడా చూపించి సైనికుల పట్ల ఆసక్తిని, అనురక్తిని కలిగించారు.



## తీర రక్షణలో భారత నౌకాదళం


సముద్ర తీరం వెంబడి రక్షణ, సహకారం, సంబంధాలు లక్ష్యంగా ఐఎఫ్ఆర్ 2016 (అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష) ఈ నెల 4 నుంచి 7వ తేదీవరకు జరిగింది. ఈ కార్యక్రమంలో నావికాదళం విన్యాసాలను ప్రత్యక్షంగా తిలకించిన నాలుగు లక్షలమంది సామాన్యులు పులకించి పోయారు. యుద్ధ వాతావరణంలో వైమానిక దళాల ప్రతిభను, ఫ్లీట్లను సందర్శకులను అబ్బురపరచింది. 50 దేశాలు పాల్గొన్న ఈ ఫ్లీట్‌లో రాష్ట్రపతి ప్రసంగిస్తూ ప్రపంచశాంతే లక్ష్యంగా భారత్ నావికాదళం అభివృద్ధి చెందిందన్నారు. దేశాల స్వాతంత్ర్యం, ప్రగతి, ప్రపంచశాంతి సామరస్యత సముద్రాల భద్రత, సుస్థిరతలపై ఆధారపడి ఉన్నాయని, ఈ సందర్భంగా రాష్ట్రపతి ఉద్ఘోదించారు. మన దేశం మూడు వైపుల సముద్ర జలాలతో ఉంది. దీన్ని నౌకా రవాణాకు వినియోగించుకుంటే ఆర్థికవ్యవస్థ బలోపేతం అవుతుంది. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని భారత్ భావిస్తోంది. భారతదేశానికి చెందిన 70 నౌకలు, విదేశాలకు చెందిన 24 నౌకలు ఇందులో పాల్గొన్నాయి. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్రమోడీ, తెలుగురాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భారత నౌకాదళాధిపతి ఆర్‌కే ధోవన్, తూర్పు నౌకాదళాధిపతి సతీష్‌సోనీ తదితరులతోపాటు పలుదేశాల నౌకా దళాధిపతులు, లక్షలాది మంది ప్రజలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఈ వేడుకలను తిలకించారు.

సుమారు 15 ఏళ్ల క్రితం 2001లో ముంబైలో నిర్వహించారు. తిరిగి ఇప్పుడు ప్రారంభించిన ఈ నౌకాదళ విన్యాసాలకు రూ. 111.39 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది. జీవీఎంసీ రూ.92 కోట్లు, ఉడా 2, కోట్లు రెవెన్యూశాఖ 2.73 కోట్లు నగరాభివృద్ధికి, సుందరీకరణ పనులకు వెచ్చించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కోసం పర్యాటక రంగం రూ.3.15 కోట్లు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర పనులకు పోలీసు శాఖ రూ. 9.87 కోట్లు , ప్రొటోకాల్‌కు బారికేడ్లకు, పారిశుధ్యానికి, తాగునీటి సౌకర్యం, ఎల్‌ఈడీ స్క్రీన్లు, కమ్యూనికేషన్ ఏర్పాట్లకు అదనంగా మరో రూ. 10.39 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దటానికి జీవీఎంసీ ఉడా అధికారులు చేపట్టిన చర్యలతో నగర రూపురేఖలు మారిపోయాయి. రూ. 44.43 కోట్లతో 63 కిమీ పొడవైన ప్రధాన రహదారులు, రూ 20.03 కోట్లతో 44 కిమీ పొడవైన ఫుట్‌పాత్‌లను అభివృద్ధి పరిచారు. రాత్రివేళల్లో ఛానళ్ల ద్వారా ప్రసారాన్ని చూసే అవకాశం కల్పించారు. వైద్యసేవకై 16 వైద్య బృందాలను 19 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. దీంతో విశాఖ అంతర్జాతీయం ఇమేజ్‌ను సొంతం చేసుకుంది.

నడి సముద్రంలో నౌకావిన్యాసాలను తిలకించ డానికి ప్రజలు తరలి వచ్చారు. విదేశీ యుద్ధ నౌకలు, గగనతలంలో వైమానిక దళ సాహసో పేత విమాన క్రీడలు ఆశ్చర్యంతో పాటు గగుర్పాటు కలిగించాయి. చుట్టూ యుద్ధనౌకలు, ఆకాశంలో హెలీకాప్టర్లు, మరోవైపు రివ్వున దూసుకొస్తున్న యుద్ధ విమానాలు సముద్రంలో ఏదో యుద్ధవాతావరనం నెలకొన్న అనుభూతి. అత్యంత వేగంతో వెళుతున్న కోస్టుగార్డు బోట్లతో నావికా సిబ్బంద రాష్ట్రపతి జిందాబాద్ అంటూ నినాదాలతో భారత నావికాదళ సైన్యం సత్తాన్ని చాటిచెప్పే విధంగా విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఐఎన్ఎస్ సుమిత్ర, సుమేధ, సురాయ్, ఐఎన్ఎస్ సుకన్య నౌకల్లో మంత్రులు, రక్షణశాఖ అధికారులతోపాటు వీఐపీలు, నేవీ అధికారులు సముద్రంలో రిహార్సల్ తిలకించారు. ఈ సందర్భంగా సముద్రంలో 6 వరుసల్లో 70 స్వదేశీ, 24 విదేశీ యుద్ధనౌకలు రిహార్సల్స్‌లో పాల్గొన్నాయి. సమీక్ష లో భాగంగా 45 యుద్ధ విమానాలు 15 పెరఫార్మేషన్లలో ఫ్లైపాస్ట్ నిర్వహించారు. బోర్నాస్టెక్, ఫైటరీమిగ్ 29 కేపీ8 ఐనావికా విమానం, ఏఈడబ్ల్యూ హెలికాప్టర్ కే. ఎం 31 విన్యాసాలు ఔరా అనిపించాయి. చేతక్ హెలికాప్టర్‌లు శోధన, సహాయకచర్యల ప్రదర్శన కనుల పండువగా జరిగింది. ఎఎల్‌హెచ్, కమోవ్ – 31, యుహెచ్–3 హెచ్ సీకింగ్ హెలి కాప్టర్‌లు విన్యాసాలు చేసాయి. వీటితోపాటు ఏజేటీ హక్‌లు సీహరియర్లు మిగ్ 29కె, డోర్నియల్–700, డోర్నియల్,–743, డోర్ని యల్ ఐఎన్ఏ ఎస్ 311, ఐఎల్38 ఎస్‌డీ డాగ్‌ఫ్లెట్‌లు విన్యాసాలు నిర్వహించాయి. ఇజ్రాయిల్, మల్దీవులు, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్, జపాన్, అమెరికా, శ్రీలంక, బ్రిటన్, వియత్నాం, దక్షిణకొరియా, స్పెయిన్, చైనా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఈజిప్ట్, ఇరాన్, ఫిజి, గ్రీస్, ఇండోనేషియా, మలేషియా, కెన్యా, రష్యా, సింగపూర్, టర్కీ, థాయిలండ్ యూకే , ఫిలిప్పైన్, మైన్మార్, సుడాన్ తదితర దేశాల నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నారు. విన్యాసాల్లో భాగంగా ప్రదర్శించిన సింధురాజ్, సింధూఘోష్, సింధుకీర్తి, సింధూవీర్, ఆర్యంత్ వంటి జలాంతర్గాములు అందరినీ అలంకరించాయి. ఈ విన్యాసాలలో ఐఎన్ఎస్ తరంగిణి, నిర్భీత్, సందర్శిని, దర్శక్, సుభద్ర, నిరూపక్, విరాట్ గంగా, రణవీర్, కార్మక్, విక్రమాదిత్యతోపాటు వివిధ యుద్ధనౌకలు ఈ రిహార్సల్స్ పాల్గొన్నాయి. రిహార్సల్స్ ప్రారంభం, ముగింపులో నేవీ సిబ్బంది కవాతులు నిర్వహించారు. జెట్టీ –4లో రాష్ట్రపతి నావికా సిబ్బంది కవాతు నిర్వహించారు. రాష్ట్రపతి నావికా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రెండుసార్లు 21 కాల్పుల ద్వారా గన్‌సెల్యూట్ చేశారు.

**విదేశీ నౌకలకు ఘనంగా వీడ్కోలు :** 'యునైటెడ్ త్రూ ఓషన్స్' అంటూ శాంతి సందేశాన్ని అందించిన భారత్ ఐఎఫ్ఆర్ విలేజ్, మారిటైమ్ ఎగ్జిబిషన్‌లో మన సంస్కృతి, శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని ప్రపంచం ముందుంచింది. అంతర్జాతీయ నేవీ సహచరులకు భారత నేవీ అధికారులు మంగళవారం సముద్రంలో అంతర్జాతీయ సరిహద్దు వరకు వెళ్లి సాగనంపాయి.





## అంతర్జాతీయ బంధాలు బలపడ్డాయి

**వైస్ అడ్మిరల్ సోనీ**

ఐఎఫ్ఆర్‌కు వివిధ దేశాల నేవీ అధికారులు, సిబ్బంది భారత్‌కు రావడంతో అంతర్జాతీయ నేవీ సంబంధాలు మెరుగుపడ్డాయని తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ సతీష్ సోనీ తెలిపారు. సెయిల్ ఇన్ కంపెనీ ఫ్లాగ్ అనంతరం ఆయన ఐఎన్ఎస్ సుమిత్ర నౌకలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమం విజయవంతం అయినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా జిల్లా అధికారులు అందించిన సహకారం మరువలేనిదని, భారత నేవీ హెడ్ క్వార్టర్‌గా విశాఖ ఎదగాలని రక్షణ మంత్రిగా తాను కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.



సముద్ర యుద్ధంలో సైనికులు







## యుద్ధ నౌకల ప్రాశస్త్యం


భారత దేశానికి మూడు వైపులా సముద్ర జలాలు ఉండటంతో శత్రు దేశాలు జలమార్గాల్లో దాడి జరిపే అవకాశం లేకుండా భారత ఆధిపత్యం తప్పనిసరి. అందుకే పటిష్టమైన నావికాదళాన్ని భారత్ రూపొందించింది. సముద్రంలో పహారాకు కేవలం మామూలు నౌకలు, సిబ్బందే కాకుండా అత్యాధునిమైన ఆయుధాలు నౌకల్లో ఉంటాయి. నౌకలు చాలా విశాలంగా, యుద్ధ విమానాలు వరుసగా దీనిపై నిలిపి ఇంధనాన్ని నింపుకొని యుద్ధ క్షేత్రానికి వెళ్లే రీతిగా నౌకానిర్మాణం చేపడతారు. దీనికోసం భారత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చుపెడుతోంది. నావికాదళంలో మరో ముఖ్య భూమికను జలాంతర్గాములు నిర్వహిస్తాయి.

సముద్ర జలాల్లో మునిగి శత్రు దేశాలకు కనిపించకుండా రాడార్ ద్వారా శత్రు దేశాల నౌకలను, జలాంతర్గాములను పసికడుతుంది. అవకాశం ఉంటే దానిలోని నావికాదళ సైనికులు శత్రువులను చుట్టు ముడతారు. లేదంటే జలాం తర్గాములు, వాయు సేనల సహకారంతో సముద్రంలోనే వారిని తుదముట్టిస్తారు. 60 ఏళ్ల క్రితం రూపొందించిన విరాట్ యుద్ధ నౌకకు రూ.300 కోట్లు ఖర్చయ్యాయి. అనేక సేవలందించిన విరాట్‌కు ఫ్లీట్ అనంతరం విశ్రాంతి కల్పించి, కార్యక్రమాన్ని విజయవంతం గాపూర్తి చేయడానికి సహాయ సహకారాలందించిన ఆంధ్రప్రదేశ్‌కు నావికాదళం కానుకగా అందించింది.











( ఎడమ నుంచి కుడి వైపునకు)
సముద్ర యుద్ధానికి బయలు దేరిన నౌకలు
శత్రు నౌకలను సముద్రంలోనే అంతం చేసేందుకు బాంబులతో దిగుతున్న సైనికులు
భూమి నుంచి ట్యాంకర్లతో దాడికి సిద్ధమైన సైనికులు
రణరంగంలో సైనికులు
ఆకాశం నుంచి శత్రు దేశాలపై నిప్పులు కురిపిస్తున్న వాయుదళం

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor-in-Chief: Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, APTEL 14598 / 2015.